మున్సిపల్ టీచర్ల పదోన్నతులకు కోడ్ బ్రేక్

ఏలూరు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో మున్సిపల్ టీచర్ల పదోన్నతుల ప్రక్రియను మంగళవారం నిలిపివేశారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖవర్గాలు ధ్రువీకరించాయి. డిసెంబరు 9 వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుంది. తర్వాత ప్రభుత్వం జారీచేసే సవరణ షెడ్యూలు మేరకు పదోన్నతులను చేపడతారు



టీచర్స్ సమరం

ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ పదవికి ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 11న అధికారికంగా నోటిఫికేషన్ విడుదలవుతుంది. ఆ తరువాత నామినేషన్ల పర్వం, వచ్చే నెల 5న పోలింగ్ నిర్వహిస్తారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఆది నుంచి ఉత్కంఠభరితంగా, ఏదొక రాజకీయ పార్టీకి అనుబంధంగా ఉన్నవారే విజయం సాధిస్తూ వస్తున్నారు. ఈ కారణంగా ఎన్నికలకు రాజకీయ రంగు తప్పనిసరి. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. వచ్చేనెల 9 వరకు కోడ్ కొనసాగుతుంది. ఈ కారణంగా ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారమే అన్ని నిబంధనలు కఠినంగా అమలు చేయబోతున్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది.

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

- 11న నోటిఫికేషన్ జారీ
- వచ్చేనెల 5న పోలింగ్
- 9న ఓట్ల లెక్కింపు

యూటీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి



యూటీఎఫ్ అభ్యర్థిగా భీమవరం ప్రాంతానికి చెందిన డి.గోపిమూర్తిని అధికారికంగా ప్రకటించింది. ఈసారి కూడా హ్యాట్రిక్ సాధిస్తామనే ధీమాతో యూటీఎఫ్ ఉంది. అయితే మిగతా పక్షాలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరినైనా రంగంలోకి దింపుతాయా, లేదా అనేది గురువారం నాటికి తేలనుంది. ఆలోపు సరైన నిర్ణయం తీసుకోవాలని పార్టీల కార్యకర్తలు తమ నాయకత్వాలకు ఇప్పటికే విజ్ఞప్తి చేయడం ఆరంభించారు. ఎలాగూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి కూటమిలో ఉన్న భాగస్వామ్య పక్షాల తరపున ఎవరినైనా రంగంలోకి దించుతారా అనే చర్చ జరుగుతుంది. ఇప్పటికే పట్టభద్రుల నియోజకవర్గం నుంచి టీడీపీ పక్షాన అభ్యర్థి రంగంలో ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఇదే ధోరణిలో నిర్ణయం తీసుకుంటే ఎవరైనా విశ్రాంత ఉపాధ్యాయుడిని రంగంలోకి దించే అవకాశం లేకపోలేదని భావిస్తున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు సమరంలా సాగబోతున్నాయి. ఇంతకు ముందు జరిగిన ఎన్నికల్లో బహుమతుల పంపిణీ, ఓట్లకు నగదు పంపిణీతో నానా రభస సృష్టించారు. సాధారణ ఎన్నికలను తలపించేలా నువ్వా నేనా అనే రీతిలో ఎన్నికల్లో అభ్యర్థుల మధ్య పోటీ నడిచింది. ఇప్పుడు ప్రభుత్వాలు మారి కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా మరోమారు ఎమ్మెల్సీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఇప్పటికే పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల నమోదులో నియోజకవర్గాల వారీగా భారీ కసరత్తు జరిగింది. అధికార టీడీపీ ఈ అంశంలో ఒకింత ముంద డుగులోనే ఉంది. ఇప్పుడు తాజాగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు వీలుగా ఎన్నికల సంఘం నగారా మోగించింది.

ఇంతకుముందు ఏం జరిగిందంటే..

శాసన మండలి ఇంతకుముందు రద్దుకాగా ముఖ్యమంత్రిగా వైఎస్.రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు శాసన మండలిని పునరుద్ధరించారు. స్థానిక సంస్థలతో పాటు ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడం ఆరంభించారు. శాసనమండలి పునరుద్ధరణ జరిగిన 2007లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి అప్పట్లో శేషారెడ్డి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో హోరాహోరీ ప్రచారం సాగింది. తగ్గట్టుగానే ఓటర్ల ఇళ్ల వరకు గిఫ్టులు చేరాయి. అలిగి ఓటింగ్‌కు దూరంగా ఉంటామని బెదిరించిన ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నానా తిప్పలు పడ్డారు. తర్వాత 2009లో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చైతన్యరాజు ఎన్నికల బరిలో దిగి పెద్ద ఎత్తున హడావుడి చేశారు. చైతన్యరాజు దూకుడు ముందు అప్పట్లో ఎవరూ ముందుకు రాలేకపోయారు. ఈ నేపథ్యంలోనే ఓటర్లు అయిన ఉపాధ్యాయులకు ఇష్టం ఉన్నా, కష్టమున్నా నేరుగానే బహుమతుల వరద పారింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలంటేనే సాధారణ ప్రజల్లో సైతం ఆసక్తిని, ఒకింత విమర్శను లేవనెత్తాయి. తిరిగి 2015లో యూటీఎఫ్ పక్షాన రాము సూర్యారావు (ఆర్ఎస్ఆర్)ను రంగంలోకి దింపారు. సీఆర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసి రిటైర్ అయిన ఆర్ఎస్ఆర్‌కు సోషల్ వర్కర్‌గా పేరుంది. పేద విద్యార్థులకు సాయపడే గుణం ఉన్న ఆయనను అందరూ అక్కున చేర్చుకునేవారు. యూటీఎఫ్ నాయకత్వం ఏరికోరి అప్పట్లో ఆర్ఎస్ఆర్‌ను రంగంలోకి దింపి ఉభయగోదావరి జిల్లాల్లోని దాదాపు 600 హైస్కూళ్లలో దగ్గరుండి మరీ ప్రచారం చేయించారు. ఆయన మంచితనంతో అలవోకగా గెలుపొందారు. ఆయన విజయం అప్పట్లో ఒక సంచలనం. రాజకీయంగా, వ్యక్తిగతంగా వివాదరహితుడైన ఆర్ఎస్ఆర్ ఎన్నికను అందరూ స్వాగతించారు. అప్పటి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సైతం ఆర్ఎస్ఆర్ విజయాన్ని కీర్తించారు. తర్వాత యూటీఎఫ్ నుంచి సాబ్జీని రంగంలోకి దించడం ఆయన కూడా అలవోకగా గెలుపొందారు. శాసన మండలి పునరుద్ధరణ తరువాత నాలుగుసార్లు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా రెండుసార్లు యూటీఎఫ్ అభ్యర్థులే గెలుపొందడం ఓ రికార్డు.

ఎవరెవరికి ఓటుంటుంది

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హైస్కూల్ ఉపాధ్యాయులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే అర్హతలేదు. ఈ పద్ధతిలో ఉపాధ్యాయులు గడిచిన ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ఈసారి సంఘాల వారీగా ఒకింత మార్పు, చేర్పులు జరిగాయి. రాజకీయ పక్షాలకు అనుబంధంగా కొన్ని సంఘాలు పుట్టుకొచ్చాయి.

కోడ్ అమలులోకి వచ్చింది

విశ్వేశ్వరరావు, డీఆర్వో



ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈనెల 11న నోటిఫికేషన్ జారీ కానుంది. ఎన్నికల ఏర్పాట్లను డీఆర్వో విశ్వేశ్వరరావు సోమవారం మీడియాకు వివరించారు. ఈనెల 11న ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ, అదే రోజు నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. వచ్చేనెల 5న పోలింగ్, డిసెంబరు 9న ఓట్ల లెక్కింపు ఉంటుందని ప్రకటించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణ

కాకినాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్‌ను నియమించారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. నామినేషన్ల స్వీకరణకు కలెక్టరేట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆరు జిల్లాల నుంచి నామినేషన్ల దాఖలుకు కాకినాడ కలెక్టరేట్‌కు రావాల్సి ఉంది. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా కాకినాడ డీఆర్వో జె.వెంకటరావు, తూర్పుగోదావరి జిల్లా డీఆర్వో సీతారా మ్మూర్తి, కోనసీమ జిల్లా డీఆర్వో వి.మదన్‌మోహ న్, పశ్చిమగోదావరి జిల్లా డీఆర్వో ఎం.వెంకటే శ్వర్లు, ఏలూరు డీఆర్వో వి.విశ్వేశ్వరరావును నియమించారు.

116 పోలింగ్ కేంద్రాలు..

ఆరు జిల్లాల్లో 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 కేంద్రాలు, తూర్పుగోదావరి జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 20 కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 22 కేంద్రాలు, కోనసీమ జిల్లాలో 12 కేంద్రాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

16,316 మంది ఓటర్లు

మొత్తం 16,316 మంది ఓటర్లు ఉన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614మంది ఓటర్లు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 2893, ఏలూరు జిల్లాలో 2605, కాకినాడ జిల్లాలో 3333, కోనసీమ జిల్లాలో 3209, పశ్చిమగోదావరి జిలాలో 3,662 ఓటర్లు ఉన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిని ఎన్నికల సంఘం ఇలా నిర్ణయించింది. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరితో పాటు ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం, పెదవేగి, పెదపాడు, దెందులూరు, ద్వారకాతిరుమల, పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, టి.నరసాపురం, కుక్కునూరు, వేలేరుపాడు, చింతలపూడి, లింగపాలెం, కామవరపుపేట, జంగారెడ్డిగూడెం మండలాలు, అల్లూరి జిల్లాలోని రంపచోడవరం, ఏజెన్సీ గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, దేవీపట్నం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, చింతూరు, వరరామచంద్రపురం, ఎటపాక, కూనవరం మండలాలుగా నిర్ణయించింది.

515.160 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరు సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంతవరకు రూ. 1.31 కోట్లు విలువైన 515.160 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జరిగిందని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. చింతలపూడి తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించినట్లు ఆమె తెలిపారు. జిల్లాలో 250 రైతు సేవా కేంద్రాలను ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాటు చేశామన్నారు. కామన్ రకానికి క్వింటాల్‌కు రూ. 2300, గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2320 చొప్పున అందించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు వారి సమీపంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని, ప్రభుత్వ సిబ్బంది స్వయంగా రైతులకు చెందిన కళ్లాల వద్దే వారు పండించిన ధాన్యాన్ని పరీక్షించి, నిబంధనల ప్రకారం కనీస మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తారన్నారు. రైస్‌మిల్‌కు ధాన్యం తరలించిన 48 గంటల్లోనే రైతు ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాకు ధాన్యం సొమ్ములు జమ చేయటం జరుగుతుందని ఆమె తెలిపారు.

ప్రభుత్వ నిబంధన మేరకు అసైన్డ్ భూములపై చర్యలు

ఏలూరుసిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూములు తదితర అంశాలలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని డివిజనల్ రెవెన్యూ అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం భూపరిపాలనా ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ ఉన్నతాధికారులు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసైన్డ్ భూముల ప్రక్రియ వెరిఫికేషన్, రిజిస్ట్రేషన్ తనిఖీ, భూములకు సంబంధించి, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించిన అర్జీలు, కుల ధ్రువీకరణ పత్రాల జారీ తదితర అంశాలపై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లుతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని రెవెన్యూ అధికారులతో మట్లాడుతూ జిల్లాలో వెరిఫికేషన్, రిజిస్ట్రేషన్‌పై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి పెండింగ్ అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి అంశాన్ని పూర్తి అవగాహనతో చేపట్టి అర్హులైన వారందరికీ న్యాయం చేయాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో భూసమస్యలపై వచ్చే ప్రతి అర్జీని పూర్తిగా అవగాహన చేసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు నేటితో గడువు ముగింపు

ఏలూరు సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటు నమోదుకు బుధవారంతో గడువు ముగుస్తుందని, అర్హులైన పట్టభద్రులు సంబంధిత తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాలు, ఆన్‌లైన్ ద్వారా గాని నమోదు చేసుకోవాలని డీఆర్వో వి.విశ్వేశ్వరరావు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుదారులు దర్యాప్తు అధికారి ఇంటికి వచ్చినప్పుడు ఆన్‌లైన్ దరఖాస్తుపై సంతకం చేసి, గ్రాడ్యుయేషన్ లేదా తత్సమాన డిగ్రీ ధ్రువపత్రం ఇచ్చి సహకారించాలన్నారు. దరఖాస్తుదారులు వారి గ్రాడ్యుయేషన్ లేదా తత్సమాన డిగ్రీ ధ్రువపత్రం కాపీ ఇస్తే సరిపోతుందని, ఇతర విద్యా పత్రాలు అవసరం లేదన్నారు.

1,34,298 దరఖాస్తులు

కాకినాడ: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు కోసం 1,34,298మంది దరఖాస్తు చేసుకున్నట్లు కాకినాడ డీఆర్వో వెంకటరావు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా 1785, కాకినాడ జిల్లా 25,964, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 28227, తూర్పుగోదావరి జిల్లా 24,825, పశ్చిమ గోదావరి జిల్లా 31,757, ఏలూరు జిల్లాలో 21,740 దరఖాస్తులు వచ్చాయన్నారు.



నాగుల చవితి సందడి

జిల్లాలోని పలు ఆలయాలు, పొలాల వద్ద పాము పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి, గుడ్లు ఉంచి నాగమ్మకు మొక్కుకున్నారు. 6లో

ఆరుకు చేరిన మృతుల సంఖ్య

గత నెల 30న సూర్యారావుపాలెంలో బాణసంచా కేంద్రంపై పిడుగు

చికిత్సపొందుతూ ముగ్గురు మహిళల మృతి..

5

ముగ్గురు దొంగల అరెస్టు

రూ.17.50 లక్షల విలువైన 25 బైక్‌లు స్వాధీనం

ఫ్లెక్సీలు.. పీక్స్‌కు

ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే..

ఫ్లెక్సీలు నేల నుంచి 6 నుంచి 10 అడుగులలోపే పెట్టుకోవాలి. ఎత్తు పెరిగితే ప్రమాదాలు జరుగుతాయని తూర్పు గోదావరి జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ బాలగంగాధర్ తిలక్ చెప్పారు. విద్యుత్ లైన్ మూడడుగుల ఎత్తులో ఏది ఉన్నా కరెంట్ షాక్ కొడుతుందని చెప్పారు.

ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుపై ఇరు వర్గాల మధ్య 18 నెలలుగా వివాదం నెలకొంది. సోమవారం విగ్రహావిష్కరణ ఏర్పాట్లలో భాగంగా ఒక వర్గానికి చెందిన యువకులు 'గ్రామంలో ఎవడ్రా మమ్మల్ని ఆపేది' అంటూ 15 అడుగుల ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీనికి ప్రతిగా మరో వర్గం యువకులు 'మేమేరా మిమ్మల్ని ఆపేది' అంటూ 20 అడుగుల ఫ్లెక్సీని తయారు చేయించారు. దీని ఏర్పాటులో కరెంట్ షాక్‌తో నలుగురు యువకులు మృతి చెందారు. ప్రశాంతంగా ఉండే గ్రామ సీమల్లోనూ ఇలాంటి స్లోగన్స్‌తో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు కక్షలను పెంచుతూ.. ప్రాణాలు తీస్తున్నాయి.

- భారీ కటౌట్‌లు.. విద్వేషపూరిత రాతలు
- తాడిపర్రు ఘటనకూ ఇదే కారణం
- పెరుగుతున్న ప్రమాదాలు.. వివాదాలు
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- పచ్చని పల్లెలకూ పాకిన విద్వేషాలు
- అనవసర గొడవలకు ఫ్లెక్సీలు ఆజ్యం

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీల ప్రచారం పీక్స్‌కి చేరింది. పెళ్లి, పేరంటం, బర్త్ డే, డెత్ డే, నాయ కులు వస్తున్నా, అభిమాన హీరోల సినిమాలు విడుదలవుతున్నా.. ఫ్లెక్సీ ఉండాల్సిందే. ఒకటి, రెండు కాదు.. ఊరు ఊరంతా ఫ్లెక్సీలతో నిండిపోవాల్సిందే. మన సత్తా ఏమిటో తెలియాల్సిందే అన్నట్టు తయారైంది ఉమ్మడి జిల్లాలో పరిస్థితి. పోటా పోటీ ఫ్లెక్సీల ఏర్పాటు, ఎదుటి వారిని కించపరిచే వ్యాఖ్యలతో విద్వేషాలను రగిల్చేలా ఇవి పెరిగిపోయాయి. గొడవలకు దారితీసి శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోంది. కొన్ని సందర్భాల్లో ప్రాణాల మీదకు తెస్తున్నాయి.

ఏర్పాటుకు అనుమతులేవి?

ఫ్లెక్సీల ఏర్పాటుపై పరిమితి లేకపోవడంతో ఎవరికి వారు ఇష్టానుసారం పెడుతున్నారు. వీటిని ఏర్పాటు చేయాలంటే సంబంధిత కార్పొరేషన్, మున్సిపాల్టీ, పంచాయతీ అనుమతులు ఉండాలి. ఆపై తగిన రుసుము చెల్లించాలి. ఎక్కడా ఇవి అమలు కావడం లేదు. ఎక్కడపడితే అక్కడ, ఎవరికిష్టం వచ్చినట్టు వారు ఐరన్ ఫ్రేమ్‌లతో కట్టేస్తున్నారు. రాజకీయ నాయకులకు అనుకూలంగా ఉండడంతో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి.

ఫ్లెక్సీల ఏర్పాటు రాజకీయ, కుల, వర్గాల పరంగా మారిపోయాయి. ఎంత ఖర్చయినా మన ఫ్లెక్సీనే పెద్దగా, ఎక్కువ రోజులుండాలన్న ఉద్దేశంతో ఐరెన్ రాడ్‌లు ఏర్పాటుచేసి మరీ ఎత్తులో పెడుతున్నారు. పది, ఇరవై, ముప్పయి అడుగులకు పెంచుకుంటూ పోతున్నారు. వీటిని ఏర్పాటు చేస్తున్నది అభిమానులే. రెక్కాడితేకాని డొక్కాడని బడుగుజీవులే. సాధారణంగా వీరు నాయకులు, సినీ నటులపై అభిమానాన్ని చాటుకుంటూ ఉంటారు. మరి కొందరు అతిగా అభిమానం చాటుకుని ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధపడుతుంటారు. వారి అమాయక అభిమానాన్ని ఆసరా తీసుకుని వారితో ఇష్టానుసారంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయిస్తూ వివాదాలకు ఆజ్యం పోస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఫ్లెక్సీల ఏర్పాట్లపై నియంత్రణ లేకపోవడంతో ఇష్టానుసారంగా క్షణాల్లో తెల్లవారేటప్పటికి ఫ్లెక్సీలు అడ్డుగా వెలుస్తున్నాయి.

ఎన్నికల సమయంలో మాత్రమే ఫ్లెక్సీల ఏర్పాటుపై అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు. మిగిలిన రోజుల్లో లేకపోవడంతో ఎక్కడబడితే అక్కడ ఎవరికి నచ్చిన చోటులో వారు కడుతున్నారు. మెయిన్ రోడ్లు కూడలి ప్రదేశాల్లో వీటిని అధిక సంఖ్యలో ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల గృహాల్లో నివసిస్తున్న వారికి దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారికి రోడ్లపై వాహనాలతో ప్రయాణించే వారికి ఇబ్బందిగా మారుతున్నాయి. వీటి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక్కోసారి భారీ వర్షాల సమయంలో ఈదురు గాలులకు ఎగిరిపడి పలువురు గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి.



- ఇటీవల ఓ ప్రజా ప్రతినిధి ఫ్లెక్సీ తొలగించారంటూ మరో వర్గం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేసే వరకు వెళ్లింది. ఇప్పటికీ అక్కడ 144 సెక్షన్ కొనసాగుతూనే ఉంది.
- ఏలూరు నగరంలో ఒక సినిమా రిలీజ్ సందర్భంగా ఒక పెద్ద ఫ్లెక్సీని కట్టగా అక్కడ టపాసులు కాల్చే సమయంలో తారాజువ్వలు అంటుకున్నాయి. కార్పొరేటర్ల మధ్య ఫ్లెక్సీ వివాదాలు చోటు చేసుకున్నాయి.
- కైకలూరు మండలం వరహాపట్నంలో ఇటీవల ఓ సినీనటుడు ఫ్లెక్సీని ఎలాంటి అనుమతులు లేకుండా షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేయడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి షాపుల వారికి నచ్చచెప్పారే తప్ప ఫ్లెక్సీలను తీయించలేకపోయారు.

ఉచిత గ్యాస్‌కు భారీ బుకింగ్స్



- బుక్ చేసుకున్న వారు 82,750 మంది
- 71,259 మందికి గ్యాస్ సిలిండర్ డెలివరీ
- 33,156 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ

ఏలూరుసిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్ పంపిణీ అమలుతో అర్హుల ఇళ్లకు గ్యాస్ సిలిండర్ చేరింది. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఇంతవరకు ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం 82,750 మంది బుకింగ్ చేసుకున్నారు. ఇప్పటివరకు 71,259 మందికి గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేశారు. వారిలో ఇంతవరకు 33,156 మందికి గ్యాస్ సిలిండర్‌కు చెల్లించిన మొత్తం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. మిగిలిన వారికి గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసిన 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాలకు సబ్సిడీ సొమ్ములు జమ చేయటం జరుగుతోందని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 6,44,222 గ్యాస్ కనెక్షన్లు

జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 6,44,222 ఉన్నాయి. దీపం కనెక్షన్లు 1,92,212 ఉండగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు 27,639 ఉన్నాయి. ఇవి గాక సీఎస్ఆర్ గ్యాస్ కనెక్షన్లు 18,243 వరకు ఉన్నాయని జిల్లా పౌరసరఫరాల శాఖ నివేదికలు చెబుతున్నాయి. సాధారణ గ్యాస్ కనెక్షన్లు 4,06,128 వరకు ఉన్నాయి. దీపం, ఉజ్వల, సీఎస్ఆర్ పథకాలు లేని సమయంలో తెల్లకార్డుదారులు తమ అవసరాల కోసం సాధారణ గ్యాస్ కనెక్షన్లను పొందాల్సి వచ్చింది.

ఖాతాలో నగదు జమ కాకుంటే..

ఉచిత గ్యాస్ సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు సబ్సిడీ సొమ్ము జమ కాలేదని ముగ్గురు వినియోగదారులు తమకు ఫిర్యాదు చేశారని, వెంటనే సమస్యను పరిష్కరించి వారి సొమ్ములను బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు డిఎస్‌ఓ ఆర్ఎస్ఎస్ సత్యనారాయణ రాజు తెలిపారు. కొన్ని కారణాల వల్ల సబ్సిడీ సొమ్ములు వెంటనే జమ కాకపోయినా పరిష్కరిస్తున్నామని ఆయన తెలిపారు. 2025 మార్చి వరకు మొదటి విడత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం కల్పించారని, అర్హులైన వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



ఎస్పీ కిశోర్‌ను కలిసిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

వైసీపీ ప్రభుత్వం నమోదు చేసిన కేసులు ఎత్తివేయండి

- ఎస్పీకి ఉద్యోగ సంఘాల వినతి

ఏలూరు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం(సీపీఎస్)ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) పునః ప్రారంభించాలంటూ ఉద్యమించిన ఉపాధ్యాయులు, ఉద్యోగులపై వైసీపీ ప్రభుత్వం అక్రమంగా నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని ఉద్యోగులు కోరారు. ఎస్పీ శివప్రతాప్ కిశోర్‌ను ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు మంగళవారం కలుసుకుని అభ్యర్థించారు. వివరాలను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో టీచర్లు, ఎన్జీవోల నేతలపై నమోదైన కేసుల వివరాలను అందజేసి, వాటికి సంబంధించిన ప్రాసిక్యూషన్ ఉపసంహరణను ఫైల్‌చేసి, కోర్టుకు సమర్పించాలని ఎస్పీని కోరామన్నారు. తమ అభ్యర్థనపై స్పందించిన ఎస్పీ కోర్టు కేసుల పూర్వాపరాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఎస్పీని కలిసినవారిలో ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్.హరనాథ్, జేఏసీ జిల్లా ఛైర్మన్ సీహెచ్.శ్రీనివాస్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముస్తఫాఅలీ, ఏపీటీఎఫ్-1938 జిల్లా కార్యదర్శి కృష్ణ, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆదినారాయణ, సీపీఎస్ నాయకుడు కె.నాగేశ్వరరావు తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

నాగుల చవితి పర్వదినం పురస్కరించుకుని మంగళ వారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉమ్మడి జిల్లాలోని ప్రసిద్ధ సుబ్ర హ్మణ్యేశ్వర క్షేత్రాలతో పాటు ఇతర ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. తెల్లవారు జామునే లేచి కుటుంబ సభ్యులతో కలిసి పంట పొలాలు, ఆలయాల వద్ద ఉన్న పుట్టల వద్ద పాలు పోసి పూజలు చేశారు.. పిల్లలు బాణసంచా కాల్చి సందడి చేశారు.


పోలవరంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు




నత్తారామేశ్వరంలో పుట్ట వద్ద పూజలు


ఏలూరులో పూజలు






లక్ష్మణేశ్వరం ఆలయం వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

పడగ విప్పిన నాగుపాము

వేకువ జాము నుంచే పంట పొలాల్లో ఉన్న పాముల పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. పెనుమంట్ర మండలంలోని నత్తా రామేశ్వరంలో రామేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న పుట్ట వద్ద నాగుపాము పడగ విప్పి భక్తులకు దర్శనం ఇచ్చింది. నాగదేవతకు భక్తులు మొక్కుకున్నారు. మండలంలోని ఆలమూరు, మార్టేరులో పూజలు నిర్వహించారు. - పెనుమంట్ర



కైకరం హైస్కూల్‌లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్

ఉంగుటూరు, నవంబరు 5: ఉంగుటూరు మండలం కైకరం హైస్కూలులో రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి అండర్-14,17 బాలుర, బాలికల అథ్లెటిక్స్ పోటీలకు ఏర్పాట్లు పూర్త య్యాయి. క్రీడా మైదానాలను సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం కడప, అనంతపురం జిల్లా జట్లు చేరుకున్నాయని హెచ్‌ఎం, ఆర్గనై జింగ్ కార్యదర్శి గుళ్ళ ప్రసాదరావు తెలిపారు. పోటీలలో 13 జిల్లాల నుంచి 650 మంది క్రీడా కారులు, 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు.



డీఎన్‌ఆర్ కళాశాలలో మహిళా బ్యాడ్మింటన్ పోటీలు

పాలకొల్లు అర్బన్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 5 : డీఎన్‌ఆర్ ప్రభుత్వ మహిళా డి గ్రీ కళా శాలలో ఈనెల 7, 8 తేదీలలో ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ స్థాయిలో మహిళా బాడ్మింటన్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు పోటీలను ప్రారంభించనున్నారని, 8వ తేదీ బహుమతి ప్రదానోత్సవ జరుగుతుందని యూని వర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధాకర్, ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియల్ (గోపన్నపాలెం) ముఖ్య అతిధు లుగా పాల్గొంటారని తెలిపారు.


బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిత్రకళా పోటీల్లో తణుకు విద్యార్థులకు బహుమతులు

తణుకు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంత ర్జాతీయ చిత్రకళా పోటీలలో తణుకు బాలు రున్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు, జ్యూరీ బహుమతులు సాధించారు. మంగళవారం స్కూలు ప్రాంగ ణంలో విద్యార్థులను ఉపాధ్యాయులను అభినం దించారు. ఇటీవల హైదరాబాదులో అంత ర్జాతీయ చిత్రకళా పోటీలు నిర్వహించారని ఈ పోటీల్లో 12 మంది బంగారు పతకాలు సాధిం చారని హెచ్‌ఎం పద్మావతి తెలిపారు. 24 మంది జ్యూరీ హానర్ సాధించారని ప్రముఖ చిత్ర కారుడు వెంపటాపు చెప్పారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభి నందించారు.


రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో కోచ్ నాగరాజు

బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టుకు వీటీహెచ్ క్రీడాకారులు

నూజివీడు టౌన్, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ - 14 బాస్కెట్ బాల్ బాలుర, బాలికల జట్లకు నూజి వీడుకు చెందిన మొత్తం ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు వీటీహెచ్ కోచ్ వాక నాగరాజు తెలిపారు. నర్సరావుపేటలో నిర్వహిం చిన అంతర్ జిల్లా బాస్కెట్ బాల్ పోటీల్లో కృష్ణా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించగా వీటీహెచ్‌కు చెందిన బి.కుసుమ, ఆర్.వాహిని రాష్ట్ర జట్టుకు ఎన్నికయ్యారన్నారు. బాలుర జట్టు తృతీయ స్థానం సాధించగా జి.జగదీష్, పి.కేతన్‌లు రాష్ట్ర జట్టుకు ఎన్నికయ్యారన్నారు. స్టాండ్ బైగా బి.వర్షిణి, ఆకాష్‌లు ఎంపికయ్యారని చత్తీస్‌గఢ్‌లో నిర్వహించే జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో వీరు ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.


గునుపూడి సోమేశ్వరస్వామి ఎదుట శ్రీరాముని రజిత ధనుస్సు, బాణం

అయోధ్య రాముని ధనుస్సుకు ప్రత్యేక పూజలు

భీమవరం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :అయోధ్యలోని రామ మందిరంపైన ఏర్పాటు చేయనున్న శ్రీరాముని విగ్రహం చేతిలో ఉంచే 13 కేజీలతో తయారు చేయించిన రామ ధనుస్సు, బాణాన్ని మంగళవారం రాత్రి పట్టణం లోని సోమేశ్వర స్వామి విగ్రహం వద్ద, మావుళ్ళ మ్మ ఆలయంలో అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య భాగ్యనగర్ సీతా రామ సేవా ఫౌండేషన్ నిర్వాహకుడు (హైదరా బాద్) చల్లా శ్రీనివాసశాస్త్రి భీమవరం తీసుకు వచ్చి స్వామి వారు, అమ్మవార్ల వద్ద ఉంచి పూజలు చేయించారు. ఆగస్టు 5వ తేదీ భీమ వరం మొదటి సారిగా తీసుకువచ్చారు. భక్తులు సమకూర్చిన 13 కేజీ వెండితో ఈ ధనుస్సు తయారు చేయించినట్టు వివరించారు. ఆలయ ఈవో రామకృష్ణ, నగేష్‌లు పాల్గొన్నారు.

‘కళాత్మక విజయం’ గ్రంథం ఆవిష్కరించిన కేఆర్ విజయ

ఆచంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆచంటకు చెందిన వైట్ల కిషోర్ కుమారుడు రాసిన కళారత్న విజయం సినీ గ్రంథాన్ని చెన్నైలో నటీమణి కెఆర్ విజయ చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు కిషోర్ తెలిపారు. చెన్నై వెళ్ళి ఆమె చేతుల మీదుగా ఆవిష్క రించినట్టు తెలిపారు. తమిళ సహాయనటుడు కృష్ణమూర్తి, జె.సూర్య కుమారి పాల్గొన్నారని తెలిపారు.



ఎర్ర కాలువ కడగండ్లు..


మాధవరంలో గట్టు లేని ఎర్రకాలువ

ఏటా వరదలతో గట్లకు తూట్లు

- పంట నష్టపోతున్న రైతులు
- గండ్లు పూడ్చేందుకు ప్రతిపాదనలు
- తాత్కాలిక మరమ్మతులకు రూ.53 లక్షలు విడుదల
- పైసా విదల్చని గత ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): ఎర్రకాల్వ పరివాహక రైతులకు కడ గండ్లు తప్పడం లేదు. ఏటా పంట వేయడం.. ఆనక వరదలు వచ్చి పంట నాశనం అవడం పరి పాటిగా మారింది. మూడేళ్ల క్రితం ఎర్రకాల్వకు పదికి పైగా గండ్లు పడగా గత వైసీపీ ప్రభుత్వం కనీసం ఇసుక మూటలు కూడా వేయలేక పోయింది. ఇరిగేషన్ శాఖ ఇంజనీర్‌లు గండ్లపూడికకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ప్రభుత్వం కనీసం ఎర్రకాలువ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు కనిపించలేదు. ప్రస్తుత వర్షాకాలంలో వచ్చిన వరదలకు వంద లాది ఎకరాలు నీట మునిగి భారీ నష్టం వాటి ల్లింది. గట్లకు పడిన గండ్లు పూడ్చకపోవడంతో నష్టం రెట్టింపైంది. వేలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. దీనికి తోడు వరద నీరు నేరుగా చేల ల్లోకి చేరడంతో వరదనీటితోపాటు చేలల్లో ఇసుక మేట వేసింది. ఫలితంగా రైతులు త్వరగా పంట వేసుకునే అవకాశం లేక వదిలేశారు. చేలల్లోని ఇసుక బయటకు తరలించడానికి ఖర్చు తడిసి మోపెడైంది. గతంలో పడిన గండ్లు మాటెలా ఉన్న ఈసారి వరద ఉధృతికి గతంలో ఉన్న గట్లు మొత్తం గుల్ల అయి ఎర్రకాలువ సమస్య మరింత జటిలమవుతోంది. ఎర్రకాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఎర్రకాలువ పరి వాహక రైతులు వేడుకుంటున్నారు.

శాశ్వత పరిష్కారమే మార్గం

గతంలో వచ్చిన ఎర్రకాలువ వరదలకు తూట్లు పడిన గట్లకు శాశ్వత పరిష్కారం దిశగా అడు గులు వేస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం ఉండదని రైతులు వేడుకుంటు న్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలోనే గట్లు పటిష్టానికి, బ్రిడ్జ్ నిర్మాణాలకు రూ.100 కోట్లు ఖర్చుచేసినా కాలువలో ఉన్న మెలికల వల్ల వరదనీరు మలు పులకు కొట్టి గట్లు దెబ్బ తిన్నాయి. అది పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అనంతపల్లి నుంచి నందమూరు వరకూ 22 మలుపులు ఉండగా వాటిని సరిచేసి కాలువ పటిష్టం చేయాలని సూచిస్తున్నారు. వాటితో పాటు ఎర్రకాలువ వరద నీరు ఉధృతంగా ఉన్న సమయంలో వరద నీటిని నల్లజర్ల మండలం నబీపేట వద్ద తాడి పూడి, పోలవరం కాలువలకు మళ్లించే ఏర్పాట్లు చేస్తే వరద ఉధృతిని తగ్గించేందుకు వీలుం టుందని ఇరిగేషన్ నిపుణులు చెబుతున్నారు.

మరమ్మతులకు రూ.53 లక్షలు

ఇటీవల వచ్చిన వరదల తీవ్రతకు దెబ్బతిన్న ఎర్రకాలువ మరమ్మతులకు రూ.53.62 లక్షల నిధులు విడుదల చేశారు. అయితే ఈ నిధులు గట్ల మరమ్మతులకు ఏమాత్రం సరిపోవని ఉన్న నిధులతో గట్లు పటిష్టం చేసేందుకు ప్రయ త్నించినా ఆ నిధులు బూడిదలో పోసిన పన్నీ రవుతుందని రైతులు చెబుతున్నారు.

గండ్ల పూడికకు రూ.7 కోట్లతో ప్రతిపాదనలు



తాడేపల్లిగూడెం మండల పరిధిలోని బంగా రుగూడెం, వీరంపాలెం, పట్టింపాలెం, అప్పా రావుపేట, మాధవరం, జగన్నాధపురం., మారం పల్లి, నందమూరు, ఆరుళ్ల మీదుగా ప్రవహించే ఎర్రకాలువలో సుమారు పదికి పైగా గండ్లు పడ్డాయి. వాటిని పూడ్చేందుకు ఎర్రకాలువ ఇంజనీర్లు మూడేళ్లుగా ప్రతిపాదనలు పంపు తూనే ఉన్నారు. ప్రతీ ఏటా వరదలకు మరింత డ్యామేజ్ పెరిగి వ్యయం రెట్టింపు అవుతోంది. ప్రస్తుతం రూ.7 కోట్లతో గండ్ల పూడికకు ప్రతి పాదనలు పంపినట్టు అధికారులు చెబు తున్నారు. ఈసారైనా కూటమి ప్రభుత్వం కాలువ గండ్లు పూడ్చాలని శాశ్వత పనులు చేపట్టాలని ఎర్ర కాలువ రైతులు కోరుతున్నారు.



ద్వారకాతిరుమల కొండపై టూరిస్టు బస్సు బ్రేక్ ఫెయిల్

వెనక్కి వచ్చి కారును ఢీకొన్న వైనం

తప్పిన పెనుప్రమాదం

ద్వారకాతిరుమల, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): చినవెంకన్న క్షేత్రానికి వచ్చిన ఓ టూరిస్టు బస్సు బ్రేక్ ఫెయిల్ అవడంతో వెనక్కి వేగంగా వచ్చి ఓ కారును ఢీకొ ట్టింది. అక్కడి నుంచి పక్కనే ఉన్న రెయి లింగ్‌ను ఢీకొని నిలిచిపోయింది. యాత్రి కులను జంటగోపురాల వద్ద దింపిన తర్వాత ఈ ఘటన జరుగడంతో పెను ప్రమాదం తప్పింది. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో ప్రమాద సమయంలో యాత్రి కులు ఎవరూ లేకపోవడంతోనే ముప్పు తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకు న్నారు. గుంటూరుకు చెందిన ఓ టూరిస్టు బస్సు పుణ్య స్థలాలు తిరుగుతూ ద్వార పూడి నుంచి మంగళవారం రాత్రికి ద్వారకా తిరుమల చేరుకుంది. అందులోని వారంతా స్వామిదర్శనం చేసుకునేందుకు బస్సు నుంచి దిగారు. ఇదే సమయంలో బ్రేక్ ఫెయిల్ అవడంతో వేగంగా వెనక్కి వెళ్లి రోడ్డుపై ఉన్న ద్వారకాతిరుమలకు చెందిన ఓ వ్యాపారి కారును ఢీకొట్టింది. ఎవరికీ ఏ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.


తెప్పోత్సవం నిర్వహించే పుష్కరిణిని శుభ్రపరుస్తున్న సిబ్బంది..


పైపుల ద్వారా కొత్తనీటిని నింపుతున్న దృశ్యం

13న చిన వెంకన్న తెప్పోత్సవం.. ముస్తాబవుతున్న పుష్కరిణి

ద్వారకాతిరుమల,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ది ద్వాదశి పురస్కరించుకుని ఈనెల 13న జరుగనున్న ద్వారకాతిరుమల చినవెంకన్న తెప్పోత్సవానికి ఏర్పాట్లు సాగుతు న్నాయి. చెత్తా చెదారంతోనూ, తామర తూడుతో నిండి ఉన్న సుదర్శన పుష్కరిణిని సిబ్బంది శుభ్రం చేశారు. పదిరోజులుగా చేస్తున్న పనులు మంగళవారానికి ఒక కొలిక్కి వచ్చాయి. ఉభయ దేవేరులతో చినవెంకన్న పుష్కరిణిలో విహరిం చేందుకు గాను అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.పుష్క రిణిలోని మురుగునీటిని తొలగించి పైపుల ద్వారా కొత్త నీటిని నింపుతున్నారు.ఆ రోజు సాయంత్రం తొళక్కవాహనంపై తిరువీధుల్లో ఊరేగిన తర్వాత రాత్రి 8 గంటల సమ యంలో పుష్కరిణి వద్దకు చేరుకుంటారు. అనంతరం తెప్పోత్సవం జరుగు తుందని ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

9 నుంచి క్షేత్రంలో సహస్ర దీపాలంకరణ సేవ

16 నుంచి భక్తులకు అందుబాటులోకి..

ద్వారకాతిరుమల క్షేత్రంలో ఈనెల 9 నుంచి నూతనంగా సహస్ర దీపాలంకరణ సేవను ప్రారంభించనున్నట్లు ఆలయ ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ సేవను 16 నుంచి భక్తులకు అందుబాటులోకి తేనున్నట్లు వివ రించారు. ప్రతీ శనివారం సాయంత్రం 7 గంట లకు ఈ సేవను జరిపిస్తామని తెలిపారు. సేవలో పాల్గొనే భక్తులు రూ. 500 చెల్లించాలని తెలిపారు. అలాగే సహస్ర దీపాలంకరణ సేవకు శాశ్వత విరాళంగా రూ.5000 చెల్లిస్తే పదేళ్ల పాటు ఏడాదికి ఒక శనివారం దాతలు పాల్గొనవచ్చని తెలిపారు. సేవలో పాల్గొనే భక్త లకు స్వామివారి దర్శనంతో పాటు శేషవస్త్రం, కండువా, రవిక, పటికబెల్లం, పసుపు, కుంకుమ అందజేస్తామని తెలిపారు.





విలేకరులతో మాట్లాడుతున్న వైద్యులు

నరాల్లో రక్తం గడ్డకట్టే వ్యాధికి అధునాతన చికిత్స

భీమవరం క్రైం, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి) : నరాల్లో రక్తం గడ్డ కట్టే విధానాన్ని నూతన వైద్య విధానంలో అరికట్టి నయం చేయవచ్చునని, రోగిని ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించవచ్చునని యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ వాస్కులర్, ఎండో వాస్కులర్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్ అన్నారు. భీమవరం హర్ష డయాబెటిక్ హాస్పటల్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నరాల్లో రక్తం గడ్డ కట్టడం వల్ల షుగర్ ఉన్న రోగి కాళ్ళు తొలగించాల్సి వచ్చేదని కొత్త చికిత్సా విధానాలతో ఈ సమస్యను అరికట్టవచ్చని అన్నారు. ప్రభుత్వం దీనిపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. ఇదే సమస్యపై పవన్ రాజు (41) అనే రోగి కుడి కాలు నొప్పి, వాపు, నడ వడంలో ఇబ్బంది వంటి సమస్యలతో జూన్ 2న సికింద్రాబాద్ యశోద హాస్పటల్లోని చేరారని, అతనికి ప్రభాకర్, డాక్టర్ భవిన్, పర్యవేక్షణలో చికిత్స అందజేశామన్నారు. చికిత్స తర్వాత రెండు రోజులకు డిశ్చార్జి చేశామని వివరించారు.సరైన రోగ నిర్ధారణ, ముందస్తు రిఫరల్, సరైన చికిత్స కార ణంగా పేషంట్ తన జీవితాన్ని కాపాడు కున్నట్టు తెలిపారు. రోగి పవన్ రాజు, సురేష్ గడ్డం, స్వామి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పడవ ఆగి పోయిందిరా.. దరిచేరే దారేదిరా ?

గూటాల రేవు నుంచి నిలిచిపోయిన పడవలు

పునరుద్ధరించాలని కోరుతున్న ప్రయాణికులు

పోలవరం మండలం గూటాల నుంచి తూర్పుగోదావరి జిల్లా వంగలపూడికి రాక పోకలు సాగించే ప్రయాణికులు, వ్యవసాయ కూలీలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018 సంవత్సరం మేనెలలో వాడపల్లిలో లాంచి ప్రమాదం జరిగి 20 మంది ప్రయా ణికులు మృత్యువుపాలైన సంఘటన తర్వాత పోలవరం మండలంలో పడవలు, లాంచీల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. దాదాపు ఏడేళ్ళ నుంచి గూటాల నుంచి తూర్పు గోదావరి జిల్లా వంగలపూడికి రాక పోకలు సాగించే పడవలను నిలిపి వేశారు. దీంతో తూర్పుగోదావరి జిల్లా వంగలపూడి సీతా నగరం , బొబ్బిల్లంక, తొర్రేడు వెళ్లేందుకు రాజ మహేంద్ర వరం నుంచి బస్సు ప్రయాణం చేసి చుట్టుతిరిగి రావడం, లేదా పోలవరం వచ్చి పురుషోత్తపట్నం రేవు లాంచీ దాటి అక్కడి నుంచి బస్సుల్లోనో ఆటోల్లోనో ప్రయా ణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యం గూటాల కొత్తపట్టిసీమ గ్రామాల నుంచి లంక భూముల్లో పనులు చేయడానికి రాక పోకలు సాగించడానికి పడవలు లేక వ్యవసాయ కోల్పోతున్నామని అధికారులు స్పందించి పడవల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కూలీలు ఉపాధి కోరారు. మండల పరిషత్ ద్వారా పడవల రాకపోకలు నిర్వహిం చడం వలన పడవల రాకపోకల సమయపాలన, భద్రతా ఏర్పాట్లు, నిర్వహణ సక్రమంగా ఉంటుందని మండల పరిషత్ ఈ విషయంలో బాధ్యతలు తీసుకుని గూటాల రేవు నుంచి పడవల రాకపోకలు పునరుద్ధరించాలని కోరుతున్నారు. - పోలవరం


గూటాల రేవు

ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా డాక్టర్ రమణారావు బాధ్యతలు



నిట్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డైరెక్టర్ రమణారావు

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 5 : ఏపీ నిట్ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వీ రమణారావు అన్నారు. రాయపూర్ నిట్‌లో డైరెక్టర్‌గా ఉన్న ఈయన మంగళవారం ఏపీ నిట్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ దేశ ప్రగతిలో విద్యార్థుల భాగస్వామ్యం అంత్యంత కీలకమైందని, ప్రజలకు మేలు చేసే విభిన్న పరిశోధనలు, ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటూ నిట్‌లో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. అనంతరం నిట్‌లోని భవన సముదాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ డీఆర్‌కే శాస్త్రి, డీన్‌లు డాక్టర్ టి.కురువయ్య, డాక్టర్ ఎన్.జయరాం, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, అసోసియేట్ డీన్ డాక్టర్ వీ.సందీప్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సావిత్రి

ఏలూరు క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ పి.సావిత్రి నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం మార్కాపురం ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎంఎస్ రాజును నియమించారు. ఆయన ప్రస్తుతం మదనపల్లి ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఇక్కడకు వస్తున్నారు. ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ సుధాకర్ జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీగా వ్యవహరించనున్నారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ ఎం.శశిధర్ ఆయన హెచ్‌ఓడీగా విధులను కొనసాగించనున్నారు.

సురక్షిత పని వాతావరణం కల్పించాలి

ఏలూరు క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రులలో పనిచేసే మహిళా డాక్టర్లు, ఆరోగ్య సంరక్షణ సహాయకులు, కార్మికులకు సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యతను సంబంధిత ఆసుపత్రి ఉన్నతాధికారులు తీసుకోవాలని జిల్లా పోలీసు ఏఆర్ డీఎస్పీ వీజీ శ్రీహరి అన్నారు. ఆసుపత్రులలో మహిళా డాక్టర్లు, ఆరోగ్య సంరక్షణ సహాయకులు, కార్మికుల రక్షణ పరిశీలనకై నియమించిన కమిటీ సభ్యులు మంగళవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో భద్రతా ఆడిట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీహరి మాట్లాడుతూ కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచార, హత్య ఘటన అనంతరం అటు వంటి సంఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా 100 పడకల పైన గల ఆసుపత్రులలో రక్షణ చర్యలపై భద్రతా ఆడిట్ నిర్వహించేందుకు జిల్లా స్థాయి కమిటీని కలెక్టర్ నియమించారని చెప్పారు. ఈ కమిటీ సభ్యులు ఆసుపత్రులలో ఆడిట్ నిర్వహించి నివేదిక సమర్పిస్తారన్నారు.



ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా ఏలూరు: ఎంపీ మహేష్

ఏలూరు టూటౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాను ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. జిల్లాను ఫుడ్‌ప్రాసెసింగ్ హబ్‌గా తీర్చిదిద్దాలని ఢిల్లీలో ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనీతను ఆమె కార్యాలయంలో కలిసి ఎంపీ మహేష్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాను ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన నీరు, రోడ్లు, వ్యవసాయ ఉత్పత్తులు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, రైల్వే కనక్టివిటీ ఉన్నాయన్నారు. జిల్లాలో వరి, మొక్కజొన్న, చెరకు, పండ్లు, ఖోఖో, పామాయిల్, కొబ్బరి, నిమ్మ, కూరగాయలు వంటి పంటలు ఎక్కువగా పండుతాయన్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి జిల్లా అనువుగా ఉంటుందన్నారు. దీని వలన నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

ఏలూరుసిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు తమకు కావాల్సిన నిధులు పొందాలంటే సమగ్రమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్, జడ్పీ సీఈవో కెఎస్‌ఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం వద్ద మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ తరగతులను జడ్పీ సీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల అవసరాలను, మౌలిక సదుపాయాలను ప్రజల ద్వారా గుర్తించి ప్రజల ద్వారానే ప్రణాళికలను రూపొందించుకునే అవకాశం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయన్నారు. అందుకు ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలతో మమేకమై ప్రజా ప్రణాళికలను 2025-26 వార్షిక సంవత్సరానికి సమర్థవంతంగా సమర్పించాలని శిక్షణార్థులను కోరారు. రాష్ట్ర పరిశీలకులు ఏపిఎస్‌ఐఆర్‌డి జేడీ జి.రమణ, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు పాల్గొన్నారు.

కొండ ముచ్చు స్వైర విహారం

మొగల్తూరు, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): కొండముచ్చు స్వైర విహారంతో ఆరు మేకలు బలి అయ్యాయి. కడలివారిపాలెం, కొండావారి పాలెం, గోడావారి పేటల్లో ఒక కొండ ముచ్చు మూడు రోజులుగా తిరుగుతున్నది. మూడు గ్రామాల్లో ఆరు మేకలను కొండముచ్చు చంపేసింది. పంచాయతీ, సంబంధిత అధికారులు స్పందించి కొండ ముచ్చు కోతిని బంధించాలని కోరుతున్నారు

కొల్లేరులో మరో వివాదం

చేపల పట్టుబడిని అడ్డుకున్న అధికారులు



చేపల పట్టుబడిని అడ్డుకున్న ఫారెస్ట్ అధికారులు

ఏలూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు గ్రామమైన మొండికోడులో చేపల చెరువు విషయంపై వివాదం నెలకొంది. నాలుగేళ్ళుగా చేపల సాగు చేస్తుండగా చేపల పట్టుబడి విషయంలో వివాదం తలెత్తింది. రెవెన్యూ ఫారెస్ట్ అధికారులు ఇది బిలో కాంటూరు పరిధిలో ఉందని, చేపలు పట్టడం నిషేధమంటూ చేపలు పట్టుబడిని అడ్డుకుని కేసులు నమోదు చేశారు. మొండికోడులో 22 ఎకరాలను ఏలూరు ఎంపీపీ శ్రీనివాసరాజు ఎకరాకు రూ.60వేలు చొప్పున నాలుగేళ్ళ పాటు లీజుకు తీసుకున్నారు. మూడు సంవత్సరాల రెండునెలలు పూర్తి అయింది. మొన్నటి వరకు శ్రీనివాసరాజు వైసీపీలో ఉండి ఇటీవల ఆ పార్టీని వీడి జనసేనలో చేరారు. లీజుకు ఇచ్చిన వ్యక్తులు చెరువు ఖాళీచేసి ఇమ్మనడంతో మంగళ వారం ఉదయం చేపలు పట్టుబడి పడుతుండగా, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు మొండికోడు చేరుకుని చేపల పట్టుబడిని అడ్డుకున్నారు. ఇది బిలో కాంటూరులో ఉందంటూ చేపల పట్టుబడి నిషేధమని శ్రీనివాసరాజు పై కేసు నమోదు చేసి వలలు, పడవను సీజ్ చేశారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి తదితరులు అక్కడకు చేరుకుని వివాదంపై ఆరా తీశారు. అయితే అదే ప్రాంతంలో 120 ఎకరాలు సాగులో ఉండగా, కేవలం తాను తీసుకున్న 22 ఎకరాల చెరువు విషయం పై పట్టుబడి పట్టక పోవడం కేవలం రాజకీయ కక్షలేనని ఎంపీపీ ఆరోపించారు.



ఆరు నెలలకే..

జిల్లాలో భీమవరం నుంచి తాడేపల్లిగూడెం రహదారి అత్యంత కీలకమైనది. రెండు ప్రధాన పట్టణాలను కలిపే ఈ రోడ్డును గత ప్రభుత్వ హయాంలో వేశారు. యండగండి నుంచి పిప్పర వరకు దీని నిర్మాణానికి రూ.1.75 కోట్లు వెచ్చించారు. ఎన్నికల ముందే రహదారి పూర్తయ్యింది. ఆరు నెలలు తిరగలేదు. రహదారి మొత్తం ఛిద్రమైంది. వర్షాలకు గతంలోకంటే దారుణంగా దెబ్బతింది. అధికారులు పరిశీలించారు. పక్కనే కాలువ ఉండడం వల్ల రోడ్డు దెబ్బతిన్నట్టు తేల్చేశారు. అంతేతప్ప ఆరు నెలలు తిరగకుండానే దెబ్బ తినడంపై కారణాలు చూడలేదు. మళ్లీ కాంట్రాక్టర్ రహదారి వేస్తామని చెప్పారంటూ సర్దుబాటు చేసుకున్నారు.

భీమవరం-తాడేపల్లిగూడెం ప్రయాణం నరకప్రాయం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రహదారి వేసిన తొలి రోజుల్లో ప్రయాణికులు ఆనందపడ్డారు. నరకయాతన నుంచి బయటపడ్డామని ఆశించారు. తీరా బస్సు ప్రయాణంలో బెంబేలెత్తిపోతున్నారు. యండగండి నుంచి పిప్పర మధ్యలో బస్సులు ఊగిపోతున్నాయి. వాహనదారులు రాకపోకలకు యాతన పడుతున్నారు. దుమ్ము రేగిపోతోంది. రహదారి మొత్తం బీటలు వారింది. చిప్స్ నలిగిపోయి దుమ్ము రేగుతోంది. భీమవరం-తాడేపల్లిగూడెం రహదారి ఇక బాగు పడదంటూ జనం గగ్గోలు పెడుతున్నారు. వైసీపీ హయాంలో దీనిపై సెటైర్‌లు వేశారు. అప్పటి ప్రజాప్రతినిధులు నాటి ఆర్అండ్‌బీ మంత్రిని జిల్లా అభివృద్ధి సమీక్షలో నిలదీసే ప్రయత్నం చేశారు. భీమవరం-తాడేపల్లిగూడెం మధ్య ప్రయాణం చేస్తే జిల్లాలో రహదారులు పరిస్థితి తెలుస్తుందంటూ అప్పటి ప్రజాప్రతినిధులు ఎద్దేవా చేశారు. తీరా ఎన్నికల ముందు నిధులు కేటాయించి పనులు చేపట్టారు. అంతలోనే రహదారి మళ్లీ గోతుల మయమైంది. సుమారు 10 కిలోమీటర్లు ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

జాతీయ రహదారి అంటూ హడావుడి

వైసీపీ హయాంలో భీమవరం-తాడేపల్లిగూడెం రహదారికి జాతీయ హోదా లభించిందంటూ ఆ నేతలు పెద్ద హడావుడే చేశారు. దీనివల్ల కేంద్రమే నిధులు కేటాయించి నిర్మాణం చేపడుతుందంటూ జనం ఆశించారు. తీరా అదంతా ఒట్టిదే అని తేలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు జాతీయ హోదా వంటిదేమీలేదని తేల్చేశారు. నిజానికి భీమవరం-తాడేపల్లిగూడెం మధ్య రహదారిని పక్కాగా నిర్మించాలంటూ జనం ఎన్నో ఏళ్ల నుంచి కోరుకుంటున్నారు. రహదారికి ఆనుకుని కాలువ ఉండడం వల్ల కోట్లు వెచ్చించి రహదారి నిర్మిస్తున్నా సరే దెబ్బ తింటోందని అధికారులు చెబుతున్నారు. కానీ శాశ్వత పరిష్కారం కనుగొనకలేకపోతున్నారు. మరోవైపు ఆరు నెలలు తిరగకుండానే రహదారి దెబ్బ తినడంపై విస్మయం వ్యక్తమవుతోంది. అంతా గోతులుగా మారింది. లేనిచోట రహదారికి బీటలు వారాయి.

కేంద్రం నుంచి రూ.25 కోట్లు మంజూరు

యండగండి నుంచి పిప్పర దాకా రహదారిని విస్తరించి నిర్మాణం చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ. 25 కోట్లు మంజూరు చేసింది. జాతీయ రహదారుల మధ్య ఉండే రాష్ట్ర రహదారులను అభివృద్ధి చేయడానికి కేంద్రం నిధులు కేటాయిస్తోంది. భీమవరం నుంచి లోసరి వరకు, అలాగే పిప్పర దాకా రహదారి అభివృద్ధి కోసం రూ. 99 కోట్లు కేటాయించింది. అందులోనే యండగండి నుంచి పిప్పర వరకు రూ. 25 కోట్లు ప్యాకేజీ ఉంది. వైసీపీ హయాంలో నిర్మాణాలు చేపట్టినట్టే రహదారిని ఏర్పాటు చేస్తే నిధులు వృథాకానున్నాయి. ఎప్పటిలాగే రహదారి దెబ్బతింటుంది. కోట్లు రూపాయలకు గండి పడనుంది. దీర్ఘకాలం మన్నిక ఉండేలా రహదారి వేయాలి. అలా కాకుండా నిర్మాణం చేపట్టినా ప్రయోజనం లేదు. పిప్పర నుంచి తాడేపల్లిగూడెం వరకు కాలువకు రివిట్‌మెంట్ ఏర్పాటు చేయడంతో రహదారి మన్నికగా ఉంటోంది. లేదా ఇతర రాష్ట్రాల్లో సిమెంట్ రహదారికి వేసినట్టు అడుగుభాగంలో కాంక్రీట్ మాదిరిగా నిర్మాణం చేపడుతున్నారు. ఆ పైన బిటిరోడ్డు వేస్తున్నారు. దీనివల్ల మన్నిక ఎక్కువగా ఉంటోంది. మొత్తంపైన ఆరు నెల ల వరకు కూడా రహదారి మన్నిక లేకపోవడంతో అంతా తలలు పట్టుకుంటున్నారు. కేంద్రం తాజాగా కేటాయించిన నిధులపైనా చర్చ సాగుతోంది.

చిప్స్‌తోనే సరా..

గోతుల్లో ఇప్పుడు కాంట్రాక్టర్ చిప్స్ వేస్తున్నారు. అంతటితో సరిపెట్టే ప్రయత్నం చేస్తే పెద్దగా ప్రయోజనం ఉండదు. మళ్లీ రహదారి వేస్తే తప్పా ప్రయాణికులకు ప్రయోజనం ఉండదు. గోతులు పడ్డ చోట చిప్స్ వేస్తున్నారు. దానివల్ల మరింత దుమ్ము రేగుతోంది. అధికారులు దీనిపై దృష్టి పెట్టాలి. కొద్ది రోజుల వ్యవధిలోనే రహదారి ఎందుకు దెబ్బతిందో ఆలోచించాలి. అలా కాకుండా కాలువ పేరుతో కారణాలు చూపితే ప్రభుత్వానికి నష్టం వాటిల్లినట్టే. ప్రయాణికులు ఎప్పటిలాగే ఇబ్బందులు పడతారు.

క్రైమ్ కార్నర్

చిక్కాలగూడెంలో వృద్ధుడి ఆత్మహత్య

కొయ్యలగూడెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): భార్య తిట్టిందని వృద్ధుడైన భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చిక్కాలగూడెం గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం పెన్నాడ యర్రా వెంకయ్య (64) కీళ్ళనొప్పులతో ఇంటి వద్దే ఉంటున్నాడని ఈ నెల పింఛన్ డబ్బులతో మద్యం ఎక్కువగా తాగటంతో భార్య మందలించింది. భార్య మందుల కోసం సోమవారం అమలాపురం వెళ్ళగా భర్త యర్రా వెంకయ్య పురుగు మందు తాగాడు. దీంతో అతడిని కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో హత్య

నిందితుడి అరెస్టు

తణుకు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 1వ తేదీన హత్య కేసులో నిందితుడిని పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈమేరకు డీఎస్పీ డి. విశ్వనాథ్ వివరాలు వెల్లడించారు. ఈనెల 1న జడ్పీ స్కూలు ఆవరణలో సజ్జాపురంకు చెందిన కాకర్ల దుర్గారావు హత్యకు గురయ్యాడు. గత నెల 31న రాత్రి 8 గంటలకు మద్యం తాగేందుకు స్కూలు ఆవరణకు వెళ్ళిన కాజా నానాజీ, అప్పటికే మద్యం మత్తులో ఉన్న మృతుడు దుర్గారావు తనకు మద్యం ఇవ్వాలని దురుసుగా నానాజీని ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగిందన్నారు. దీంతో సమీపంలోని రాయితో దుర్గారావు తలపై నానాజీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. నిందితుడు నానాజీ తప్పించుకునే క్రమంలో సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు ఆధారంగా అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు చెప్పారు. గత మూడురోజులుగా సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వదంతులు, ఉహాగానాల్లో వాస్తవం లేదని వివరించారు. కేసును ఛేధించడంలో కృషి చేసిన పట్టణ, రూరల్ సీఐలు కొండయ్య, కృష్ణకుమార్, ఎస్‌ఐలు ఆదినారాయణ, చంద్రశేఖర్, ఏఎస్సై శ్రీధర్‌ను డీఎస్పీ అభినందించారు.

శశికుమార్‌పై మరో కేసు నమోదు

ఏలూరు క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బీసీ హాస్టల్ వార్డెన్ శశికుమార్‌పై ఓ విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదుపై మరో కేసును ఏలూరు టూటౌన్ పోలీసులు నమోదు చేశారు. ఏలూరు గ్రీన్‌సిటీలో నివాసం ఉంటున్న బి.శశికుమార్ చింతలపూడి మండలంలోని ఒక బీసీ వసతి గృహంలో వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య ఏలూరు అమీనాపేటలో ఉన్న దయానంద సరస్వతి బాలికల వసతి గృహానికి సంరక్షకురాలిగా వ్యవహరించేది. తరచుగా ఆమె వద్దకు వస్తూ అక్కడ ఉన్న విద్యార్థినులకు మాయమాటలు చెప్పి ఫొటోషూట్ పేరుతో వివిధ ప్రాంతాలకు తీసుకువెళ్ళేవాడు. ఒక విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదుతో అతని పైన అతని భార్యపైన, మరో యువతిపై కేసు నమోదు చేసి పోలీసులు ఆ ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. అయితే మరో బాధిత బాలిక ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఏలూరు టూటౌన్ పోలీసులు శశికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరుకు చేరిన మృతుల సంఖ్య

గత నెల 30న సూర్యారావుపాలెంలో బాణసంచా కేంద్రంపై పడ్డ పిడుగు
చికిత్సపొందుతూ ముగ్గురు మహిళల మృతి... బాధితులంతా పేదలే..

పెంటపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సృష్టించిన విధ్యంసానికి పేదల బతుకులు ఒక్కొక్కటిగా రాలిపోతున్నాయి. గత నెల 30వ తేదీన ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడిన దుర్ఘటనలో మృతుల సంఖ్య 6కు చేరింది. సంఘటనా స్థలంలోనే వేగరౌతు శ్రీవల్లి, గుమ్మడి సునీత మృత్యువాత పడగా రెండు రోజుల తరువాత ఇరగవరం మండలం కావలిపురం గ్రామానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరావు మృతి చెందాడు. సోమవారం రావిపాడు గ్రామానికి చెందిన శీలం లక్ష్మి(45) , మండలంక కమలరత్నం (47), దువ్వ గ్రామానికి చెందిన కడిమి కుమారి(53) లు ఏలురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. చనిపోయిన ముగ్గురు మహిళలు కూడా రెక్కల కష్టంపై జీవనం సాగించే కుటుంబాలే. రావిపాడుకు చెందిన శీలం లక్ష్మికి భర్త దుర్గారావు, కుమార్తె ఉండగా కమలరత్నంకు భర్త వెంకట్రావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదంలో ఒకరి తరువాత మరొకరు మొత్తం ముగ్గురు మహిళలు విగత జీవులు కావడంతో స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. దువ్వ గ్రామానికి చెందిన కడిమి కుమారికి భర్త లేడు. ఒక కుమారుడు మాత్రమే ఉన్నాడు. పొట్టకూటి కోసం వెళ్ళిన మహిళ మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదం అలుముకున్నది.

ముగ్గురు దొంగల అరెస్టు

రూ.17.50 లక్షల విలువైన 25 బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లు పరిశీలిస్తున్న ఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అంతర్‌రాష్ట్ర మోటారు సైకిల్ దొంగలు ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి 17 లక్షల 50 వేల రూపాయల విలువైన 25 మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఏలూరు సబ్బులవారి వీధి కి చెందిన పూతి ప్రసాద్ అలియాస్ పెరుమాళ్ళ దాలయ్య (57), పాలకొల్లులోని బంగారు వారి చెరువు గట్టు ప్రాంతానికి చెందిన నడిపూడి అప్పలనా యుడు (ప్రస్తుతం ఏలూరు సబ్బుల వారి వీధి)లో ఉంటు న్నాడు. నాగాంజనేయులు కలిసి ఒక ముఠాగా ఏర్పడి కలిదిండి, తాడేపల్లి గూడెం టౌన్, ముదినేపల్లి, భీమవరం రూరల్, ఏలూరు వన్‌టౌన్, ఏలూరు టూటౌన్, కైకలూరు ప్రాంతాల్లో మొత్తం 16 కేసుల్లో 25 మోటారు సైకిళ్ళను అపహ రించారు. ఈ ముగ్గురిని అరెస్టు చేసి 25 మో టారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. ఏలూ రుకు చెందిన పెరుమాళ్ళ దాలయ్య 2000వ సంవత్సరంలో 100 సైకిళ్ళను అపహరి ంచి అప్పట్లోనే పోలీసులకు చిక్కాడు. ఆనాటి నుంచి సైకిల్ దొంగతనాలు చేస్తూ చివరకు మోటారు సైకిల్ దొంగగా మారాడు. ఎన్నో కేసుల్లో శిక్షలు పడ్డాయి. ప్రస్తుతం వీరు అపహ రించిన మోటారు సైకిళ్ళలో టీవీఎస్ సుజికీ చెందిన జూపిటర్ 125 స్కూటర్లనే తస్కరించారు.

బస్సులో బంగారు ఆభరణాల చోరీ

ఐదుగురి అరెస్టు.. 28 కాసుల బంగారం స్వాధీనం



నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

భీమవరం క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బంగారు వస్తువులు ఉన్న బ్యాగును దొంగతనం చేసిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి 28 కాసుల బంగారం వస్తువులను, ఆటో, మడత చాకును స్వాధీనం చేసుకున్నట్లు భీమవరం టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత నెల 20న పట్టణానికి చెందిన కాల నాగ ఉమామహేశ్వరీ పుట్టిల్లు అయిన వీరవాసరం నుంచి భీమవరం రావడానికి ఆర్టీసి బస్సు ఎక్కారు. తమ దగ్గరున్న బంగారాన్ని బ్యాగులో పెట్టారు. బస్సు రద్దీగా ఉడటంతో బ్యాగును కొంత దూరంలో ఉంచగా బస్సు ఎక్కిన నలుగురు మహిళలు బ్యాగులో నుంచి బంగారు ఆభరణాలను తస్కరించి వీరవాసరం రైల్వేస్టేషన్ వద్ద దిగిపోయారని తెలిపారు. ఉమామహేశ్వరి ఇంటికి వచ్చిన తరువాత బ్యాగును చూసుకున్న తరువాత బంగారు ఆభరణాలు లేకపోవటంతో నలుగురు మహిళలపై అనుమానంతో ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేసి ఆకివీడు సమతానగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ గుద్దటి వల్లియ్య, దుంపగడపకు చెందిన నరమామిడి పోసమ్మ, గంగాలమ్మకోడుకు చెందిన ఆవుల రవళీతోపాటు బండి నరసింహులు, నరమూడి హరిబాబులను అరెస్టుచేసి 28 కాసుల బంగారాన్ని స్వాధీనంచేసుకున్నామని, కోర్టులో హాజరు పరిచామన్నారు.

ఉపాధి కూలీ మృతి

ఉండి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అర్తమూరు గ్రామంలో ఉపాధి పనికి స్థానిక పామర్తి వీరస్వామి(80) వెళ్లి పని చేస్తుండగానే కళ్లు తిరిగి కిందపడి కొద్దిసేపటికి మృతిచెందాడు. మృతునికి ఇరువురు సంతానం. ఈవిషయం తెలుసుకుని ఎన్ఆర్‌జిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ఓమెగారాజు సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు.

యువకుడి కిడ్నాప్?

ప్రేమ వ్యవహారమే కారణమా..

పెనుగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇరగవరం మండలం అయితంపూడికి చెందిన కొప్పినీడి వెంకట సాయిబాబు అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఈయువకుడు డిగ్రీ పూర్తి చేసి పెనుగొండలో ట్యాక్స్‌కన్సల్టెంట్‌గా ఆఫీసు పెట్టుకుని ఆడిట్ చేస్తూ ఉంటున్నాడు. ఇతను డిగ్రీ చదువుతున్న సమయంలో ఆచంటకు చెందిన ఒక యువతిని ప్రేమించాడు. వీరిద్దరి వేరు వేరు కులాలు కారణంగా పెళ్ళికి అమ్మాయి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. ఈనేపథ్యంలో ఆ యువతికి గత నెల 17న నిశ్చితార్థం జరుగుతుండగా అక్కడికి ఆ యువకుడు వెళ్ళి గొడవ చేయగా స్థానిక ఎస్ఐ కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. అయినప్పటికి యువకుడు వెంకట సాయి బాబు ఆ యువతిని పెళ్ళి చేసుకోబోయే వ్యక్తికి ఫోన్ చేసి ఇబ్బంది పెట్టినట్లు సమాచారం. దానిపై ఆ అమ్మాయి కుటుంబ సభ్యులు ఆచంట పోలీసు స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ నెల 1న సాయంత్రం పెనుగొండ నుంచి సిద్ధాంతం వెళ్ళే రోడ్డులో నక్కల కాలువ దాటిన తరువాత ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సాయిబాబును తీసుకెళ్లిపోయారని ఈ విషయం ఆ యువకుడు తండ్రి పెనుగొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ సంఘటనపై పెనుగొండ ఎస్ఐ కె. గంగాధర్ కేసు నమోదు చేశారు.

తక్కువ ధరకే బంగారమంటూ మోసం

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు బంగారం ఇస్తానని చెప్పి డబ్బు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. ఏలూరు జిల్లా పోలవరం మండలం పాత పట్టిసీమకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి నారపురెడ్డి కనకయ్య మధురపూడి ఎయిర్‌పోర్టులో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. 2023 జూలై 6న కుటుంబ సభ్యులతో షిర్డీ వెళ్లాడు. అక్కడి మ్యూజియంలో పనిచేస్తున్న అల్లాడి కునాల్ కశ్యప్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి కనకయ్య భార్య వరలక్ష్మిని కశ్యప్ అక్కా అని పిలిచేవాడు. 2024 ఫిబ్రవరి 6న పట్టిసీమ ఇంటికి వచ్చి వధువు ఫొటోలు చూపించి పెళ్లి కుదిరిందని చెప్పి 2 వారాలు ఇంట్లో ఉన్నాడు. విదేశాల్లో కొంత బంగారం తక్కువ ధరకు లభించిందని, దానికి సంబంధించి సెక్యూరిటీ డిపాజిట్లు చెల్లించాలని, బంగారానికి రూ.4,80,000 దఫదఫాలుగా ఫోన్‌పే ద్వారా ఎస్‌బీఐ అకౌంట్‌కి, బైక్‌కి సంబంధించి కొవ్వూరు బజాజ్ షోరూలో రూ.86,000 చెల్లించారు. ఎంతకి బంగారం గాని, బైక్ గాని, ఇవ్వకపోవడంతో తీసుకున్న డబ్బు ఇవ్వాలని ఎన్నిసార్లు ఫోన్‌చేసినా సమాధానం చెప్పడం లేదన్నారు. విశాఖపట్నం ఆసుపత్రిలో ఉన్నాడని తెలిసి అక్కడికి వెళ్లి కనకయ్య విశాఖపట్నం ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు జీరో ఎఫ్ఐ ఆర్ నమోదు చేసి కేసును కొవ్వూరు రిఫర్ చేశారు. దీనిపై కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు మరలా కేసునమోదు చేసినట్టు తెలిపారు.

లిఫ్టు పడి ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాల్గో అంతస్తులో ఉన్న లిఫ్టు ఆకస్మాత్తుగా పడిపోవడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు అశోక్‌నగర్ గంగానమ్మగుడి సమీపంలో ఉన్న తవలత హోమ్ అపార్టుమెంటులో నాల్గో అంతస్తు నుంచి లిఫ్టు అకస్మాత్తుగా తెగిపడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ సంఘటనపై బొప్పన మన్మధరావు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు జరగనున్న సదస్సు రద్దు

చింతలపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున నేడు జంగారెడ్డిగూడెంలో జరగనున్న ప్రధాన మంత్రి ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ అవగాహన సదస్సు రద్దు చేశామని తదుపరి తేదీని తెలియచేస్తామని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

జాబ్ మేళా రద్దు

భీమడోలు, నవంబరు 05 (ఆంధ్రజ్యోతి) : శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల భీమడోలులో బుధవారం నిర్వహించే ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ కారణంగా జాబ్‌మేళాను రద్దు చేశామని ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపం

లింగపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చినమాట ప్రకారం రోడ్డు నిర్మాణానికి రూ.కోటి 80 లక్షలు మంజూరు చేయించడం సంతోషమని బాదరాల గ్రామ సర్పంచ్ బి.శ్రీనివాసరావు అన్నారు. గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు జి.చలపతిరావు ఆధ్వర్యంలో బాదరాల నుంచి ఆసన్నగూడెం వరకు నిర్మించే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్.నాగేంద్ర, బి.పుల్లారావు, పి.మురళీ, ఒ.ఏసువరప్రసాద్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలపై దృష్టి పెట్టండి

చింతలపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జనాభా, పట్టణ అవసరాలు గుర్తించి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ పావనికి నాయకులు టి.బాబు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలో వాష్‌రూమ్స్ ఏర్పాటు చేయాలని, బైపాస్ రోడు పనులు పూర్తి చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు. మండల కార్యదర్శి కె.గురవయ్య, షేక్ కాలేషా, జాని, లక్ష్మణరావు, అలగ్జాండర్ పాల్గొన్నారు.

8న వ్యవసాయ కార్మిక సంఘ సమావేశం

కామవరపుకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తూరు నుంచి ద్వారకాతిరుమల టర్నింగ్ పాయింట్ వద్దగల గ్రోమోర్ ఎరువుల భవనంలో ఈ నెల 8న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా సమితి విస్తృత సమావేశం ఏర్పాటు చేసినట్టు మండల సీపీఐ కార్యదర్శి టీవీఎస్ రాజు, బీకేఎంయు జిల్లా ఉపాధ్యక్షులు జి.బాలయేసు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బుచ్చిబాబు తెలిపారు.

9న రైతులతో సమన్వయ సమావేశం

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 26న అర్జీలతో కూడిన హెచ్చరికలు జారీ చేయాలని రైతు కార్మిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. రైతు కార్మిక సంఘాల నాయకుల సమావేశంలో మంగళవారం ఏపీ రైతు సంఘ కార్యదర్శి కె.శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు ఆర్.రామ్మోహన్‌రావు, టీకేఎంయూ జిల్లా అధ్యక్షులు బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం తనవిధానాలను ఏ మాత్రం మార్చుకోలేదని విమర్శించారు. నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్, రెడ్డి శ్రీనివాస డాంగే తదితరులు ఉన్నారు.

16న ఆదివాసీ గర్జన బహిరంగ సభ

బుట్టాయగూడెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని, షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. దొరమామిడిలో సర్పంచ్ టి.రాముడు అధ్యక్షతన ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ జేఏసీ, ఆదివాసీ సర్పంచ్‌ల సంఘం ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం జరగ్గా రాష్ట్ర అధ్యక్షుడు కె.మధు పాల్గొని మాట్లాడారు. ఈ నెల 16న బుట్టాయగూడెంలో జరుగు ఆదివాసీ గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జేఏసీ ఛైర్మన్ ఎం.శ్రీనివాసరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ సంఘాల నాయకులు టి.లక్ష్మణరావు, ఎస్.ముక్కయ్య, ఆర్.బసవరాజు, పి.కొవ్వాడయ్య, ఎం.చలపతిరావు, టి.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీ కొని వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆర్చి సమీపంలో ద్విచక్ర వాహనదారుడిని మంగళవారం లారీ ఢీ కొట్టిన ఘటనలో జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం గ్రామానికి చెందిన పేరుబోయిన రాంబాబు (55) అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాంబాబు జంగారెడ్డిగూడెంలో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వచ్చారు. కుమార్తె పిల్లల కోసం ఫ్రైడ్‌రైస్ తీసుకు వస్తానని చెప్పి మామా అల్లుళ్లు రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్లారు. సుబ్బంపేట రోడ్డు నుంచి బైపాస్ రోడ్డు ముందు రాంబాబు దాటి కొయ్యలగూడెం వైపుగా వెళ్తుండగా వెనుక నుంచి హైదరాబాదు వైపు నుంచి కొయ్యలగూడెం వస్తున్న లారీ అతివేగంగా వచ్చి రాంబాబు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో రాంబాబు వెనుక చక్రంలో ఇరుక్కున్నాడు. కొద్ది దూరం రాంబాబును లారీ అతివేగంగా ఈడ్చుకుపోయిన తర్వాత లారీ డ్రైవరు హ్యాండు బ్రేకు వేశాడు. ఈ ఘటనలో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం ఎస్సై ఎస్‌కె.జబీర్ ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి, లారీని పోలీసు స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవరు, క్లీనర్ పరారయ్యారు.

నివేశన స్థలం నిరుపయోగం


లబ్ధిదారులకు కేటాయించిన భూమి

ఉంగుటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేజర్ గ్రామాలలో ఒకటైన నారాయణపురం గ్రామ ప్రజల అవసరార్థం గత ప్రభుత్వం మూడేళ్ల క్రితం సొంతింటి కల నిజం చేస్తామంటూ ఆర్భాటంగా 104 మంది లబ్ధిదారులకు సర్వే నెం.895లోని రెండు ఎకరాల 69 సెంట్లను 125 మంది లబ్ధిదారులకు 860 సర్వే నెంబరులో రెండు ఎకరాల 70 సెంట్ల భూమిని పంపిణీ చేయడానికి చదును చేసి సిద్ధం చేశారు. ప్రస్తుతం ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలతో పేరుకు పోవడంతో ఇది జగనన్న కాలనీయేనా అన్న అనుమానం కలుగుతుంది. ఈ భూమిని తమకు ఎప్పుడు కేటాయిస్తారో అని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. దీంట్లోని సర్వే నెం. 860లో రెండెకరాల 70 సెంట్ల భూమిలో వివిధ రకాల చెట్లు ఉండడంతో ప్రభుత్వ అనుమతితో తొలగించవలసిన ఉంది. మూడేళ్లు దాటిన నేపథ్యంలో సర్వే నెం. 895లో 14 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

దుకాణాల పరిశీలన

జీలుగుమిల్లి, నవంబరు 5 : (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లిలో జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోయే దుకాణాలను తహసీల్దారు బి.సందీప్ మంగళవారం పరిశీలించారు. రహదారి విస్తరణలో మార్కింగ్ చేసిన ప్రాంతం, ఆర్ అండ్‌బీలో ఉన్న వ్యాపార సముదాయాలు వారి పేర్లు నమోదు వంటి విషయాలపై సిబ్బందితో కలసి క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. త్వరలో సంబంధిత జాబితా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అనంతరం నష్టపరిహారం అందుతుందన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి


విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకుని విద్యార్థినులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పోలసానపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను మంగళవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను, పాఠశాల ఆవరణను పరిశీలించారు. విద్యార్థులకు ఇచ్చే ఆహారం రుచి చూసి, విద్యార్థులతో మాట్లాడారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

దీపావళి బాధితులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి టీడీపీ ఎప్పుడు ముందుంటుందని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. దీపావళి పండుగ రోజు ఉల్లిబాంబుల దుర్ఘటనలో గాయాలపాలైన బాధితులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ బాంబు పేలిన ఘటనలో ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారన్నారు. జి.సురేష్, కె.సత్యనారాయణ, కె.శ్రీనివాస్, ఎస్‌కే ఖాదర్, డి.సతీష్, ఎండీ ఖాన్‌లకు ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున అందజేశారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరణ

బడేటి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులంతా ఆదేశించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం విడుదలైన ఎల్‌వోసీ కాపీలను అందజేశారు. పి.శివప్రసాద్, సీహెచ్.వెంకటరత్నం, బి.శ్రీనివాస్, ఎ.తిరుపతి పాల్గొన్నారు.

ప్రతి నిర్వాసితునికి న్యాయం చేస్తాం

కుక్కునూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు వలన ముంపునకు గురవుతున్న ప్రతీ నిర్వాసితునికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు. కుక్కునూరు మండలానికి మంగళవారం ఆయన విచ్చేశారు. దాముచర్లలో ఉన్న రామాలయానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ గతంలో కుక్కునూరు మండలానికి విచ్చేసిన సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం కుక్కునూరులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో కుక్కునూరు మండల ప్రజల సమస్యలను టీడీపీ నాయకులు ఆయనకు వివరించారు. 2019లో టీడీపీ హయాంలో ఉన్నప్పుడు ప్రకటించిన జాబితాను అమలు చేయాలని, లోఓల్టేజ్ విద్యుత్ సమస్య పరిష్కరించాలని, అలాగే రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని శ్రీనివాస్‌ను కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ అన్నారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, కె.సత్యనారాయణ, ఉప సర్పంచ్ పి.రాజు, పి.శ్రీనివాసరావు, సీహెచ్.సత్యనారాయణ, బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర మందులపై జీఎస్టీ ఎత్తివేయాలి

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా రంగంలో పనిచేస్తున్న మెడికల్ రిప్రజంటేటివ్స్‌కు కనీస వేతనాలు అమలు చేయాలని ఈ నెల 7న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్టు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వీవీఎస్ ప్రసాద్ తెలిపారు. స్థానిక సీఐటీయు కార్యాలయంలో మంగళవారం మహాధర్నాకు సంబంధించిన పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర, నిత్యావసర మందుల ధరలు అందుబాటులో ఉండేలా మందులపై జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు బీవీ సత్యనారాయణ, ఉమామహేష్, వేణు ఉన్నారు.

పొలం పిలుస్తోంది

భీమడోలు/పెదపాడు/లింగపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల్లో రైతులకు గోనెసంచులను అందుబాటులో ఉంచామని భీమడోలు, పెదపాడు, లింగపాలెం ఏవోలు ఉషారాణి, ప్రదీప్‌కుమార్, కె.మురళీకృష్ణ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ 17 శాతం తేమ వచ్చిన రైతులకు గోనెసంచులు ఇస్తామన్నారు. పశుసంవర్ధకశాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గింజా కొంటాం : ఎమ్మెల్యే సొంగా


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

చింతలపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి ప్రతీ గింజా కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక సొసైటీ ఆవరణలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ యోజకవర్గంలో 45 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. రవాణా చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్‌పాషా మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యం 4 లక్షల 60 వేల మెట్రిక్ టన్నులు కాగా ఇందు కోసం 250 కొనుగోలు కేంద్రాలు నెల ముందుగానే ఏర్పాటు చేశామన్నారు. ఉంగుటూరు మండలంలో 24 గంటల్లోనే ధాన్యం సొమ్ములు రైతు ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జె.ముత్తారెడ్డి మాట్లాడుతూ రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణాలను వినియోగించుకోవచ్చన్నారు. ఈ సభలో నియోజకవర్గంలో సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసిన 22 మందికి రూ.16.54 లక్షల చెక్కులను ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌పాషా, సొసైటీ కార్యదర్శి బాలకృష్ణ ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సన్మానించారు. ఏడీఏ నాగకుమార్, ఏవో మీనాకుమారి, సిహెచ్.ధర్మరాజు, ఎం.వెంకట్రామయ్య, కె.రాజారెడ్డి పాల్గొన్నారు.

● దెందులూరు : గాలాయగూడెం సహకార సంఘం బ్యాంకు ఆవరణలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ ఏడీ సుబ్బారావు, ఏఈ వెంకటేశ్వర్లు, బ్యాంకు స్పెషల్ ఆఫీసర్, కార్యదర్శి సుబ్బారావుతో కలిసి మండల టీడీపీ అధ్యక్షుడు, ఎం.నారాయణ ప్రసాద్(మిల్లుబాబు), నియోకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఎం.నాని ప్రారంభించారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఎ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను ఆన్‌లైన్ చేయండి

జంగారెడ్డిగూడెం : ఇప్పటివరకు ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ నమోదుకు వచ్చిన దరఖాస్తులను త్వరతగతిన ఆన్‌లైన్ చెయ్యాలని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలోని ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ ఆన్‌లైన్ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన ఓటు నమోదు వివరాలను తహసీల్దార్ స్లీవజోజిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డి.శ్యామ్‌చంద్ర శేషు ఉన్నారు.

59 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ఏలూరు/జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని 10 మండలాల్లో 59 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. రైతులు తేమ 17 శాతం లోపు ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రేడ్ - ఎ ధాన్యాన్ని క్వింటాలకు రూ.2,320, సాధారణ రకం ధాన్యానికి రూ.2,300లకు పొందవచ్చని తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలంలో 14, కొయ్యలగూడెం-10, బుట్టాయిగూడెం-5, జీలుగుమిల్లి-3, కుక్కునూరు-4, పోలవరం-6, వేలేరుపాడు-2, కామవరపుకోట-4, ద్వారకాతిరుమల-6, టి.నరసాపురం మండలంలో 5 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయమని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. స్థానిక నాగేంద్రస్వామి ఆలయం వద్ద మంగళవారం ఆయన పూజలు చేసి అనంతరం టీడీపీ నాయకురాలు జి.మేఘలాదేవి ఇంటి వద్ద నాయకులతో మాట్లాడారు. పట్టభద్రుల విజయం కోసం కూటమి నాయకులు అంకిత భావంతో పని చేయాలని అన్నారు. టీడీపీ నాయకురాలు జి.మేఘలాదేవి, జనసేన పట్టణ అధ్యక్షుడు ఎం.శ్రీను, తదితరులు ఉన్నారు.

పెట్టుబడి సాయం ఇవ్వండి

కుక్కునూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వెంటనే రైతులకు పెట్టుబడి సాయం అందించాలని రైతు సంఘం జిల్లా నాయకులు ఎం.వెంకటాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదరావిగూడెం, శ్రీధర వేలేరు సచివాలయం ఎదుట మంగళవారం ఆందోళన జరిపారు. పెట్టుబడి సాయం లేకపోవడంతో రైతులు బయట అప్పులు తెచ్చి వ్యవసాయం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. నాయకులు కె.లక్ష్మయ్య ఎం.రమణయ్య, శ్రీను, డి.వెంకట్రావు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించండి

పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ కుక్కునూరులో మంగళవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కే.గౌస్ మాట్లాడుతూ పత్తి క్వింటాకు రూ.18,500లు, వరికి రూ.5 వేలు ఇవ్వాలన్నారు. నాయకులు రామారావు, సత్యనారాయణ, ముత్యాలరావు, వీరాస్వామి, కల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కన్నతల్లిని, జన్మభూమిని మర్చిపోకూడదు

సినీ నటుడు మురళీమోహన్


సమావేశంలో మాట్లాడుతున్న మురళీమోహన్

పెదపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కన్నతల్లిని, జన్మభూమిని మర్చిపోకూడదని, గ్రామాల అభివృద్ధికి తమవంతు సాయాన్ని ప్రతి ఒక్కరూ అందించాలని రాజమండ్రి మాజీ ఎంపీ, సినీ నటుడు మాగంటి మురళీమోహన్ అన్నారు. పెదపాడులో జరిగిన ఎన్ఆర్ఐ కాకరాల రమేష్ సంస్మరణ కార్యక్రమంలో మురళీమోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పెదపాడులో కాకరాల ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఉషాబాల అధినేత ఉషా బాలకృష్ణారావు మాట్లాడుతూ సమాజాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్న రమేష్ మృతి బాధకరమన్నారు. కాకరాల రాజా మాట్లాడుతూ కాకరాల ట్రస్ట్ ద్వారా రూ.25 లక్షలతో పెదపాడు హైస్కూల్, జూనియర్ కళాశాల అభివృద్ధికి, మరో రూ.25 లక్షలతో పెదపాడు ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి త్వరలో నిధులు వెచ్చిస్తామని తెలిపారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేశారు. సీహెచ్.విద్యాధరరావు, యు.రాంప్రసాద్, బి.కాశీబాబు, జి.అనిల్, బి.బాబ్జి, జి.మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో పాట్నా హైకోర్టు న్యాయమూర్తి


చిత్రపటాన్ని అందుకుంటున్న జడ్జి

ద్వారకాతిరుమల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి మంగళవారం ఉదయం సందర్శించారు. కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు ఆమెకు స్వామివారు, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించండి


డీఈవోకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఏలూరు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మను ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నాయకులు మంగళవారం కలుసుకుని అభ్యర్థించారు. తొలుత డీఈవోకు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపి అనంతరం టీచర్ల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. డీఈవో మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఏలూరు జిల్లా అత్యధిక ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించాలన్నారు. ఏపీటీఎఫ్ నాయకుల్లో రెడ్డిదొర, సాల్మన్‌రాజు, రామారావు, ప్రకాష్‌రావు, శ్రీనివాస్, కొండయ్య, లక్ష్మణ్ కుమార్, శ్యాంపీటర్, వెంకటరత్నం, కుమార్, తదితరులున్నారు. కొత్తగా డీఈవో బాధ్యతలు స్వీకరించిన వెంకటలక్ష్మమ్మను విద్యాశాఖకు చెందిన పలువురు వేర్వేరు ప్రకటనల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

డీఈవోకు కలెక్టర్ శుభాకాంక్షలు

డీఈవో బాధ్యతలు చేపట్టిన ఎం.వెంకటలక్ష్మి కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలమొక్కను అందజేశారు. డీఈవోకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

'అపార్' కష్టాల్లో ఉన్నాం...ఆదుకోండి

'అపార్' డేటా నమోదులో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి తగిన సవరణలతోకూడిన ఆదేశాలను జారీ చేయాలని అభ్యర్థిస్తూ డీఈవో వెంకటలక్ష్మికి డీటీఎఫ్ జిల్లా నాయకులు కె.కాంతారావు, ఎం.ఆదినారాయణ తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా విద్యార్థుల పుట్టిన తేదీ సర్టిఫికెట్‌కు, పాఠశాలలో నమోదైన తేదీకి ఉన్న వ్యత్యాసాన్ని సవరించేందుకు ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. అపార్‌ను జనరేట్ చేసేందుకు ఆధార్ కార్డులో సవరణల నిమిత్తం మండలాలవారీగా పాఠశాలల్లో మొబైల్ ఆధార్ క్యాంపులను నిర్వహించాలని సూచించారు.

వేతన బకాయిలు చెల్లించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు మెయింటినెన్స్ వర్కర్స్ జీతాలు చెల్లించాలని, యూనియన్ గౌరవాధ్యక్షుడు డి.ప్రభాకర్, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి వినతిపత్రం అందించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల ఏజెన్సీ, మెట్టప్రాంత ప్రజలకు గోదావరి జలాలను అందించటానికి సత్యసాయి మంచినీటి పథకం ట్రస్ట్ తరఫున ఏర్పాటు చేశారని తెలిపారు. మెయింటినెన్స్ బాధ్యతను 2007లో ఎల్‌అండ్‌టీ కంపెనీకి అప్పగించారని, గత ప్రభుత్వం ఈ పథకాల నిర్వహణ ఖర్చులు చెల్లించకపోవడంతో కోర్టుకు వెళ్ళారని అప్పటి నుంచి కార్మికులకు జీతాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేతనాలు బకాయిలు విడుదల చేయండి

కుక్కునూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హమాలీల వేతన బకాయి వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వైసాయి కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీసీసీ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. మూడు నెలలుగా హమాలీలు చేసిన పనికి వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. బియ్యం ఎగుమతుల పని చేస్తున్న హమాలీలకు నెలనెల జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సురేష్, తిరుపతయ్య, సాయిరామ్, గెరటం శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

ఏలూరు టూ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.బాలాజీ తెలిపారు. కార్యకర్తలు, నాయకులు సభ్యత్వ నమోదు చేయించాలని కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

ఏలూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదులో బీజేపీని ఏలూరు జిల్లాలో అగ్రస్థానంలో నిలపాలని, పార్టీ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.శ్రీదేవి అన్నారు. కొత్త బస్టాండ్ సమీపంలోని అంబికా ప్లేవర్స్‌లో మంగళవారం బీజేపీ ఏలూరు జిల్లా సంఘటన్ పర్వ్ జిల్లా స్థాయి కార్యశాల జిల్లా అధ్యక్షుడు సిహెచ్ విక్రమ్‌కిషోర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా సభ్యత్వ ప్రముఖ్ ఎస్.మాలతిరాణి, నాయకులు కె.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

సర్దుబాటు ఛార్జీలు వద్దు

ఏలూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని కోరుతూ సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. డి.ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలు వరదలు, విషజ్వరాలు, కరువుతో ఇబ్బందులు పడుతున్న సమయంలో సర్దుబాటు ఛార్జీలతో వేలకోట్ల రూపాయల అదనపు భారాలు మోపటం దారుణమన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య, బి.వెంకటేశ్వరరావు, యు.హేమశంకర్, కె.బేబి, వరప్రసాద్, కె.కృష్ణమాచార్యులు, హేమకుమారి, సాయిగంగా పాల్గొన్నారు.

సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ

ఏలూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని యేరువాక కేంద్రం, సమేతి ప్రాథమిక, వ్యవసాయ సహకార సంఘ ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యం పై 15 రోజుల సర్టిఫికెట్ కోర్సును మంగళవారం స్థానిక యేరువాక కేంద్రంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ ఏడీ ఆర్పీ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఈ కోర్సును సద్వినియోగం చేసుకుని రైతు అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. డాక్టర్ కె.ఫణికుమార్, ప్రధానశాస్త్రవేత్త కోర్సు యొక్క ముఖ్య ఉద్దేశం వివరించారు. జిల్లా హార్టికల్చర్ అధికారి డాక్టర్ ఎస్.రామ్మోహన్, డివిజనల్ కోఆపరేటివ్ అధికారిత్రినాథ్, లలితసుధ, ఎన్.నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

దెందులూరు, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చార్లెస్ వెస్లీ ఎంపికయ్యాడని హెచ్‌ఎం శర్మ తెలిపారు ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకూ ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాజనందిగంలో జరిగే 68వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 విభాగం బాస్కెట్‌బాల్ పోటీ పాల్గొంటారన్నారు.

రోడ్లు బాగు చేయండి

ఏలూరు టూ టౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్లన్నీ గుంతలమయంగా ఉన్నాయని రోడ్లను బాగు చేయండి మహాప్రభో అంటూ బీజేపీ నేతలు నగర కమిషనర్ ఎ.భానుప్రతాప్‌ను వేడుకున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం బీజేపీ ఆసెంబ్లీ కోకన్వీనర్ బి.నారాయణరావు, ఓబీసీ మోర్చ జోనల్ ఇన్‌చార్జి ఎల్.అనీల్ ఆచార్య మాట్లాడుతూ వైఎంహెచ్ఏ హాలు ఎదురుగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిమిత్తం రోడ్డును తవ్వేశారని, ఏళ్లు గడుస్తున్నా డ్రైన్ల నిర్మాణం జరగటంలేదు. ఎస్.నెలరాజ పాల్గొన్నారు.

నాగుల చవితి వేడుకలు


(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

నాగుల చవితి వేడుకలు జిల్లాలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. వ్యవసాయ కుటుంబాలకు చెందిన రైతులు పొలాల్లో తమకు ఎటువంటి హాని కలుగ చేయకుండా కాపాడాలని కుటుంబ సభ్యులతో పుట్టలో పాలు పోశారు. ఏలూరులోని అంబికా దేవి అమ్మవారిని ఆర్డీవో డాక్టర్ అచ్యుత్ అంబరీష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పవర్‌పేట శివాలయంలో మేయర్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

క్రైం కార్నర్

ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్ అదుపుతప్పి ఇనుప ముళ్ళకంచెను ఢీ కొనడంతో ఇద్దరు యువకులు తీవ్ర గాయపడ్డారు. భీమడోలు మండలం ఆగడాలలంక గ్రామానికి చెందిన సైదు పవన్, మోర్ చందు కలిసి మోటారు సైకిల్‌పై గుండుగొలను సమీపంలోని భోగాపురం నుంచి వస్తుండగా ఆ గ్రామ సమీపంలో మోటారు సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఇనుప ఊచల ముళ్ళకంచెను ఢీ కొన్నారు. ఈ ప్రమా దంలో ముళ్ళకంచె వీరి శరీరాన్ని చీల్చి వేయడంతో తీవ్ర గాయాలకు గురయ్యారు. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

ఎక్సైజ్ దాడులు

ఏలూరు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్లు ఫణికుమార్, భోగేశ్వరరావు, ఎస్‌ఐ రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బలివే గ్రామానికి చెందిన సిల్లమంతుల సీతారామయ్య, ముసునూరు మండలం ఎల్లాపురంకి చెందిన వీరంకి నాగరాజులను అరెస్టు చేసి 65 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. భీమడోలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చెట్టున్నపాడు గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ఘంటసాల కృష్ణావతారాన్ని అరెస్టు చేసి 40 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కైకలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెచ్చికలమర్రులో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ముంగర మూర్తిరాజును అరెస్టు చేసి 34 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాడులు నిరంతరం కొనసాగిస్తామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) సిహెచ్ అజయ్‌కుమార్ సింగ్ తెలిపారు.

చికెన్ వ్యర్థాల వాహనాలు పట్టివేత

పెదపాడు : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు, పరిసర ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి బొలేరో, ఐషర్ రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కె.శారదసతీష్ తెలిపారు. వాహనాలను స్వాధీనం చేసుకుని వాటిల్లోని సుమారు 15 వేల కిలోల చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్టు చెప్పారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

ద్వారకాతిరుమల/ఏలూరు క్రైం: ఏలూరు మండలం ప్రత్తికోళ్ళ లంక, ద్వారకాతిరుమల మలసానికుంటలో కోడి పందేల స్థావరంపై మంగళవారం దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేసి, రెండు కోడి పుంజులు, రూ.18 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

లింగపాలెం : బాదరాల గ్రామంలో పేకాట ఆడుతున్నారని సమాచారంతో సిబ్బందితో కలసి దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని ధర్మాజీగూడెం ఎస్ఐ వెంకన్న తెలిపారు. వారి వద్ద నుంచి రూ.ఆరు వేల 300 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొల్లేరులో మరో వివాదం

చేపల పట్టుబడిని అడ్డుకున్న అధికారులు



చేపల పట్టుబడిని అడ్డుకున్న ఫారెస్ట్ అధికారులు

ఏలూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): కొల్లేరు గ్రామమైన మొండికోడులో చేపల చెరువు విషయంపై వివాదం నెలకొంది. నాలుగేళ్ళుగా చేపల సాగు చేస్తుండగా చేపల పట్టుబడి విషయంలో వివాదం తలెత్తింది. రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు ఇది బిలో కాంటూరు పరిధిలో ఉందని, చేపలు పట్టడం నిషేధమంటూ చేపలు పట్టుబడిని అడ్డుకుని కేసులు నమోదు చేశారు. మొండికోడులో 22 ఎకరాలను ఏలూరు ఎంపీపీ శ్రీనివాసరాజు ఎకరాకు రూ.60వేలు చొప్పున నాలుగేళ్ళ పాటు లీజుకు తీసుకున్నారు. మూడు సంవత్సరాల రెండునెలలు పూర్తి అయింది. మొన్నటి వరకు శ్రీని వాసరాజు వైసీపీలో ఉండి ఇటీ వల ఆ పార్టీని వీడి జనసేనలో చేరారు. లీజుకు ఇచ్చిన వ్యక్తులు చెరువు ఖాళీచేసి ఇమ్మనడంతో మంగళ వారం ఉదయం చేపలు పట్టుబడి పడుతుండగా, రెవె న్యూ, ఫారెస్ట్ అధికారులు మొండి కోడు చేరుకుని చేపల పట్టుబడిని అడ్డుకు న్నారు. ఇది బిలో కాంటూరులో ఉందంటూ చేపల పట్టుబడి నిషేధమని శ్రీనివాసరాజు పై కేసు నమోదు చేసి వలలు, పడవను సీజ్ చేశారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి తదితరులు అక్కడకు చేరుకుని వివాదంపై ఆరా తీశారు. అయితే అదే ప్రాంతంలో 120 ఎకరాలు సాగులో ఉండగా, కేవలం తాను తీసుకున్న 22 ఎకరాల చెరువు విషయం పై పట్టుబడి పట్టక పోవడం కేవలం రాజకీయ కక్షలేనని ఎంపీపీ ఆరోపించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా ఏలూరు: ఎంపీ మహేష్



ఏలూరు టూటౌన్, నవంబరు5 (ఆంధ్ర జ్యోతి): ఏలూరు జిల్లాను ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. జిల్లాను ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తీర్చి దిద్దాలని ఢిల్లీలో ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనీతను ఆమె కార్యాలయంలో కలిసి ఎంపీ మహేష్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాను ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవ సరమైన నీరు, రోడ్లు, వ్యవసాయ ఉత్పత్తులు, వ్యవసాయ ఆధారిత పరిశ్ర మలు, రైల్వే కనక్టివిటీ ఉన్నాయన్నారు. జిల్లాలో వరి, మొక్కజొన్న, చెరకు, పం డ్లు, కోకో, పామాయిల్, కొబ్బరి, నిమ్మ, కూరగా యలు వంటి పంటలు ఎక్కువగా పండు తాయన్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి జిల్లా అనువుగా ఉంటుందన్నారు. దీని వలన నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశా లు మెరుగుపడతాయన్నారు.

క్రైమ్ కార్నర్

ఆరుకు చేరిన మృతుల సంఖ్య

గత నెల 30న సూర్యారావుపాలెంలో బాణసంచా కేంద్రంపై పడ్డ పిడుగు

చికిత్సపొందుతూ ముగ్గురు మహిళల మృతి... బాధితులంతా పేదలే..

పెంటపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సృష్టించిన విధ్వంసానికి పేదల బతు కులు ఒక్కొక్కటిగా రాలిపోతున్నాయి. గత నెల 30వ తేదీన ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడిన దుర్ఘటనలో మృతు ల సంఖ్య 6కు చేరింది. సంఘటనా స్థలంలోనే వేగరౌతు శ్రీవల్లి, గుమ్మడి సునీత మృత్యు వాత పడగా రెండు రోజుల తరువాత ఇరగ వరం మండలం కావలిపురం గ్రామానికి చెం దిన విప్పర్తి వెంకటేశ్వరావు మృతి చెందాడు. సోమవారం రావిపాడు గ్రామానికి చెందిన శీలం లక్ష్మి(45) , మందలంక కమలరత్నం (47), దువ్వ గ్రామానికి చెందిన కడిమి కుమారి(53) లు ఏలురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. చనిపోయిన ముగ్గురు మహిళలు కూడా రెక్కల కష్టంపై జీవనం సాగించే కుటుంబాలే. రావిపాడుకు చెందిన శీలం లక్ష్మికి భర్త దుర్గారావు, కుమార్తె ఉండగా కమలరత్నంకు భర్త వెంకట్రావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదంలో ఒకరి తరువాత మరొకరు మొత్తం ముగ్గురు మహిళలు విగత జీవులు కావడంతో స్థాని కులు కన్నీరుమున్నీరవుతున్నారు. దువ్వ గ్రా మానికి చెందిన కడిమి కుమారికి భర్త లేడు. ఒక కుమారుడు మాత్రమే ఉన్నాడు. పొట్ట కూటి కోసం వెళ్ళిన మహిళ మృత్యువాత పడ టంతో గ్రామంలో విషాదం అలుముకున్నది.

ముగ్గురు దొంగల అరెస్టు

రూ.17.50 లక్షల విలువైన 25 బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లు పరిశీలిస్తున్న ఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అంతర్‌రాష్ట్ర మోటారు సైకిల్ దొంగలు ముగ్గురి ని అరెస్టు చేసి వారి నుంచి 17 లక్షల 50 వేల రూపాయల విలువైన 25 మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివ రాలను వెల్లడించారు. ఏలూరు సబ్బులవారి వీధి కి చెందిన పూతి ప్రసాద్ అలియాస్ పెరుమాళ్ళ దాలయ్య (57), పాలకొల్లులోని బంగారు వారి చెరువు గట్టు ప్రాంతానికి చెందిన నడిపూడి అప్పలనా యుడు (ప్రస్తుతం ఏలూరు సబ్బుల వారి వీధి)లో ఉంటు న్నాడు. నాగాంజ నేయులు కలిసి ఒక ముఠాగా ఏర్పడి కలిదిండి, తాడేపల్లి గూడెం టౌన్, ముదినేపల్లి, భీమవరం రూరల్, ఏలూరు వన్‌టౌన్, ఏలూరు టూటౌన్, కైకలూరు ప్రాంతాల్లో మొత్తం 16 కేసుల్లో 25 మోటారు సైకిళ్ళను అపహ రించారు. ఈ ముగ్గురిని అరెస్టు చేసి 25 మో టారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. ఏలూ రుకు చెందిన పెరుమాళ్ళ దాలయ్య 2000వ సంవత్సరంలో 100 సైకిళ్ళను అపహరి ంచి అప్పట్లోనే పోలీసులకు చిక్కాడు. ఆనాటి నుంచి సైకిల్ దొంగతనాలు చేస్తూ చివరకు మోటారు సైకిల్ దొంగగా మారాడు. ఎన్నో కేసుల్లో శిక్షలు పడ్డాయి. ప్రస్తుతం వీరు అపహ రించిన మోటారు సైకిళ్ళలో టీవీఎస్ సుజికీ చెందిన జూపిటర్ 125 స్కూటర్లనే తస్కరించారు.

మద్యం మత్తులో హత్య

తణుకు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాం గణంలో ఈనెల 1న హత్య కేసులో నిందితుడిని పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. డీఎస్పీ డి.విశ్వనాథ్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 1న జడ్పీ స్కూలు ఆవరణలో సజ్జాపురానికి చెందిన కాకర్ల దుర్గారావు హత్యకు గురయ్యాడు. గత నెల 31 రాత్రి 8 గంటలకు మద్యం తాగేం దుకు స్కూలు ఆవరణకు వెళ్ళిన కాజా నానాజీ, అప్పటికే మద్యం మత్తులో ఉన్న దుర్గారావు తనకు మద్యం ఇవ్వాలని దురుసుగా నానా జీని ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి సమీపంలోని రాయితో దుర్గారావు తలపై నానాజీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందా డన్నారు. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు ఆధారంగా అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు చెప్పారు. కేసును ఛేదిండంలో కృషి చేసిన పట్టణ, రూరల్ సీఐలు కొండయ్య, కృష్ణకుమార్, ఎస్‌ఐలు ఆదినారాయణ, చంద్రశేఖర్, ఏఎస్సై శ్రీధర్‌ను డీఎస్పీ అభినందించారు.

బెల్టుషాపులపై దాడి..

ముదినేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వైవాక గ్రామంలో అనధికారికంగా మద్యం నిల్వలు కలిగి ఉన్న వ్యక్తులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో బెల్టుషా పులు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ముదినేపల్లి ఎస్‌ఐ వీరభద్రరావు తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించి ఆ గ్రామానికి చెందిన వేణు, సుబ్రహ్మణ్యం, సుబ్బరాజును అరెస్టు చేసి వారి నుంచి 120 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

కలిదిండి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరుతెగలపాడులో నిర్వహి స్తున్న కోడిపందేల శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3.500, కోడిపుంజు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 18 మంది అరెస్ట్

నూజివీడు టౌన్, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణంలో సోమవారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 18 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టణ ఎస్సై జోతి బసు తదితరులు పాల్గొన్నారు.





పెద్దఎడ్లగాడి వంతెన మధ్యలో ఒకేచోట అనేక గుంతలు (ఇన్‌సెట్) గుంతలో ఇనుప ఊచలు బయటపడి ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

అమ్మో పెదయడ్లగాడి వంతెన

కొల్లేరు సరస్సుపై నాలుగు దశాబ్దాల క్రితం రెండు జిల్లాలను అనుసంధానం చేసేందుకు నిర్మించిన వంతెన కనీస మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరింది. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణం చేసే వంతెనపై పెచ్చులూడి ఊచలు బయటపడినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు.

» గుంతలు.. పైకి లేచిన ఊచలతో ప్రమాదాలు » కన్నెత్తి చూడని అధికారులు

కైకలూరు, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): కైకలూరు- ఏలూరు ఆర్ అండ్‌బీ రహదారిలో పెద్ద ఎడ్లగా డిపై నిర్మించిన వం తెన మధ్యలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ఇనుప ఊచలు బయట పడినా పట్టించు కోకపోవడంతో అవి వర్షానికి నాని తుప్పుపట్టి విరిగిపోయాయి. వర్షపు నీరు నిల్వ ఉన్నా, లేక పోయినా ద్విచక్ర వాహనదారులు ఆటోవాలాలు ఆ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే వాహనాల టైర్లకు ఇనుప ఊచలు దిగి పంచర్లు అయి రాత్రి సమయాల్లో అనేకమంది ప్రయాణీకులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రహదారులనే కాదు వంతెనలను సైతం పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. వంతెన మధ్యలో ఒకే చోట అనేక గుంతలు ఏర్పడడంతో తప్పించుకుని వెళ్లేందుకు వాహనదారులకు అవకాశం లేక వాటిపై నుంచే రాకపోకలను సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గుంతలు లేని రహదారులు నిర్మాణానికి నిధులు సమకూరుస్తుంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి వంతెనపై ఉన్న గుంతలను పూడ్చి ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఇన్‌చార్జ్‌లతో పశువైద్య సేవలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాట్రాయి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలో రెగ్యులర్ పశువైద్యాధికా రులు లేకపోయినా ఇన్‌చార్జుల ద్వారా అన్ని గ్రామాల్లో నిత్యం పశు వైద్య సేవలు అందించ టానికి కృషి చేస్తున్నామని పశుసంవర్థక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి. నెహ్రూబాబు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'పశు వైద్యాధికారి కావలెను' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. రెండు సంవత్స రాల నుండి చాట్రాయి మండలంలో పశు వైద్య శాలలకు పశు వైద్యాధికారులను ప్రభుత్వం నియ మించకపోవటంతో, చాట్రాయి, చనుబండ పశువై ద్యశాలలకు సీతానగరం పశువైద్యాధికారి డాక్టర్ కె. శివ నాగేంద్రరావును, చిత్తపూరు పశు వైద్యశా లకు ఈదర పశువైద్యాధికారి డాక్టర్ జి. శశివ ర్మను ఇన్‌చార్జులుగా నియమించటంతో పాటు పశువులకు టీకాలు వేయిస్తున్నామన్నారు.



సోషల్ మీడియాను దుర్వినియోగం చేయవద్దు

నూజివీడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాను దుర్వినియోగం చేయటం వల్ల కుటుంబపరంగా అనేక సమస్యలను ఎదు ర్కోవాల్సి వస్తుందని, నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజరు రోళ్ళమూడి శేఖర్‌బాబు అన్నారు. నూజివీడు కోనేరుపేట పీహెచ్‌సీలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు మత్తు పదార్థాల విని యోగం-సోషల్‌మీడియా దుర్వినియోగంపై అవ గాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తున్నాయని, ఆరోగ్య కార్య కర్తలుగా మత్తుకు బానిసలైన వారిని గుర్తించి కౌన్సెలింగ్‌కు తీసుకురావాలని సూచించారు.



ఆధునిక పద్ధతులతో లాభసాటి వ్యవసాయం

చాట్రాయి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతు లు ఆధునిక పద్ధతులు ఆచరించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని వ్యవసాయాధికారి శివశంకర్ కోరారు. జనార్దనవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ అధిక దిగుబడులు ఆశించి రైతులు ఎరువులు, పురుగు మందులు అధిక మోతాదులో వాడటం వలన పెట్టుబడి ఖర్చులు పెరగటమే కాక నేల నిస్సారంగా మారిపోతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిం చాలన్నారు. మొక్కలకు బలాన్నిచ్చే ఎగ్-అమినో యాసిడ్స్(కోడిగుడ్డు కషాయం)ని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. టీడీపీ నాయకులు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం: మంత్రి



కాట్రేనిపాడులో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ముసునూరు, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని కాట్రేనిపాడులో సీసీ రహదారులకు సోమవారం రాత్రి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించకపోగా, కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘాల నిధులను సైతం పక్కదారి పట్టించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టిందన్నారు. మండలంలో ఆరు వేల మీటర్ల అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు రూ. 3 కోట్లు కేటాయించిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేనందున ఎన్నికల్లో సీఎం ఇచ్చిన హామీలను విడతలవారీగా అమలు చేస్తున్నారన్నారు. సీసీ రోడ్ల నిర్మాణాలు నిబంధ నల ప్రకారం నాణ్యతతో ఉండేలా చూడాలని పంచాయతీరాజ్ అధికారులను మంత్రి ఆదేశించారు. సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు, ఉప సర్పంచ్ రాపర్ల సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టుకు వీటీహెచ్ క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులతో కోచ్ నాగరాజు

నూజివీడు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడ రేషన్ అండర్-14 బాస్కెట్ బాల్ బాలుర, బాలికల జట్లకు నూజి వీడుకు చెందిన మొత్తం ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు వీటీహెచ్ కోచ్ వాక నాగరాజు తెలిపారు. నర్సరావుపేటలో నిర్వహించిన అం తర్ జిల్లా బాస్కెట్ బాల్ పోటీల్లో కృష్ణా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించగా వీటీహెచ్‌కు చెందిన బి.కుసుమ, ఆర్.వాహిని రాష్ట్ర జట్టుకు ఎన్నికయ్యారన్నారు. బాలుర జట్టు తృతీయ స్థానం సాధించగా జి.జగదీష్, పి.కేతన్‌లు రాష్ట్ర జట్టుకు ఎన్నికయ్యారన్నారు. స్టాండ్ బైగా బి.వర్షిణి, ఆకాష్‌లు ఎంపికయ్యారని ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించే జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో వీరు ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.



విద్యార్థులతో మమేకం కావాలి

ఆగిరిపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రధానో పాధ్యాయులు తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులతో మమేకమైతే నూటికి నూరుశాతం ఫలితాలు రాబట్టవచ్చని విద్యాశాఖ జోన్ 2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి అన్నారు. ప్రధానోపాధ్యాయులకు తోటపల్లి హీల్ ప్యారడైజ్ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న స్కూల్ లీడర్ షిప్ శిక్షణలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగి చారు. బాలలను మంచి పౌరులుగా తీర్చి దిద్దాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని సీమాట్ - సమగ్ర శిక్ష రాష్ట్ర డైరెక్టర్ వి.మస్తానయ్య ప్రారంభించారు. ఎంఈవోలు, ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం

మండవల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం కొర్లపాడులో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దేశీ వెరైటీ (మైసూర్ మల్లిక) వరి పొలంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగం జరిగింది. ఎంటి కాంతమ్మ మాట్లాడుతూ దేశీ వెరైటీ ప్రస్తుతం పంటకోత ప్రయోగంలో 20 బస్తాల అంచనా దిగుబడి వచ్చిందన్నారు. ఏడీఏ వెంకటమణి రైతులకు పలు సూచనలు చేశారు.

డ్రోన్‌తో కలుపు మందు పిచికారీ



కలిదిండి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కోరుకొల్లు పంచాయతీ చెరువులో దట్టంగా పేరుకుపోయిన గుర్రపు డెక్క నిర్మూలనకు డ్రోన్‌తో మందును మంగళవారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ మాట్లాడుతూ మందుల పిచికారీకి డ్రోన్‌లు ఉపయోగిస్తే తక్కువ ఖర్చవుతుందని రైతులు ఉపయోగించుకోవాలన్నారు. కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి బీజేపీ సభ్యత్వాలు

ముదినేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీజేపీ సభ్యత్వాలను లక్ష్యానికి మించి నమోదు చేసినందుకు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, ఏలూరు జిల్లా పార్టీ సంస్థాగత రిటర్నింగ్ అధికా రిణి రేలంగి శ్రీదేవి అభినందించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు ఆధ్వర్యం లో మండలంలో 10 వేల సభ్యత్వాలను నమోదు చేసిన మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, నాయకులను మంగళవారం ఏలూరులో జరిగిన కార్యక్రమంలో అభినందించి సంస్థాగత ఎన్నికల నిర్వహణకు కూడా సహకరించాలని కోరారు.

జాబ్ మేళా రద్దు

కైకలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఈ నెల 7వ తేదీన కైకలూరులో నిర్వహించే జాబ్‌మేళా రద్దు చేస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. 7న కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రకటించామని కోడ్ కారణంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.



కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

ముసునూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని వలసపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతులకు హామీలేని పంట రుణాలు ఇవ్వా లని రాష్ట్ర కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య కోరారు. మంగళ వారం చెక్కపల్లి ఎస్‌బీఐ మేనేజర్ ప్రవీణ్ కుమార్‌తో ఆయన సమావేశమై పంట రుణాలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యాదర్శి రాయంకుల లక్ష్మణరావు, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేటితో ముగుస్తున్న ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు గడువు

నూజివీడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ అభ్యర్థులను గుర్తించి ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయించే దిశగా రాజకీయ పార్టీ నాయకులు చర్యలు చేపట్టాలని నూజివీడు తహసీల్దార్ బి.సుబ్బారావు సూచించారు. మంగళ వారం నూజివీడు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయపక్షాల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ బుధవారంతో ముగు స్తున్న నేపథ్యంలో దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అందించాలన్నారు. నూజివీడు ఎన్నికల డీటీ బి.రవికిరణ్‌సింగ్ మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గ వ్యాప్తంగా మంగళ వారం సాయంత్రం వరకు 5,983 దరఖాస్తులు అందాయన్నారు.

గడువు పొడిగించండి..

నూజివీడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గం ఎమ్మె ల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ మందకొడిగా సాగు తున్న నేపథ్యంలో దరఖాస్తు దాఖలు గడు వును మరో పదిరోజులు పెంచాలని, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు విజ్ఞప్తి చేశారు. నూజివీడులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆన్‌లైన్ అప్లికేషన్ కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మరో 10 రోజుల పాటు దరఖాస్తు గడువును పెంచా లని, ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయాల్లో వేలసంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.



ముసునూరులో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ముసునూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముసునూరు పంచాయతీ పరిధిలో నూతన సీసీ రోడ్ల పనులను మంగళవారం సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, టీడీపీ మండల అధ్య క్షుడు దేవినేని ధలరాం, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ ఎక్స్‌క వేటర్‌కు కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారం భించారు. టీడీపీ గ్రామ అధ్యక్షులు పి.ఆంజనే యులు, ఎస్ఎంసీ చైర్మన్ నక్కా యోహాను తదితరులు పాల్గొన్నారు.







సింగరాయపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి.. కైకలూరు చిన్నచెరువుగట్టుపై పుట్టలో పాలు పోస్తున్న భక్తులు.. గోపవరంలో స్వామివారు

నోము పండించవా స్వామీ..

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి.. ఆలయాలు, పుట్టల వద్ద భక్తుల పూజలు

కైకలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితిని మంగళవారంనాడు ప్రజలు భక్తిశ్రద్ధల తో జరుపుకున్నారు. మంగళవారం పుట్టల వద్ద పాలు పోశారు. చిన్నపిల్లలకు బూరెలు పోసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కైకలూరు చిన్నచెరువుగట్టుపై గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద పుట్టలో పాలుపోసి వేలాది మంది భక్తులు తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. శాంప్‌డ్రైన్‌గట్టుపై ఉన్న సంతాననాగేంద్రస్వామి ఆలయం వద్ద ఉన్న పుట్టలో పాలు పోసి భక్తులు పూజలు చేశారు.

ముదినేపల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లు తున్న ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం ప్రధాన సెంటర్‌లోని సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామి ఆలయం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దయెత్తున వచ్చిన భక్తులు పుట్టలో పాలుపోసి పూజలు జరిపారు. మహిళలు నాగ ప్రతిమకు పూజలు చేసి పాల పొంగళ్లు సమర్పించారు. కైకలూరు మెజిస్ట్రేట్ లక్ష్మి దంపతులు ఆలయంలో పూజలు చేయగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి వారిని సత్కరించారు. ఆలయం వద్ద సిఐ రవికుమార్ పర్యవేక్షణలో ముదినేపల్లి, కలిదిండి, మండవల్లి ఎస్‌ఐలు బందోబస్తు నిర్వహించారు. డిసెంబరు 7 నుంచి ఆలయంలో ప్రారంభం కానున్న షష్ఠి కల్యాణోత్సవాల ఏర్పాట్లకు బుధవారం రాట పూజను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చేస్తారని ఏసీ గంగా శ్రీదేవి తెలిపారు.

కలిదిండి: పెదలంక నాగేశ్వరస్వామి, కోరుకొల్లు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు పుట్టలో పాలుపోసి పూజలు చేశారు. వెంకటాపురంలో భక్తులు పుట్టలో పాలుపోశారు. గ్రూపు దేవాలయాల ఈవో శేఖర్ ఆలయం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ముసునూరు: గోపవరం, వలసపల్లి, కాట్రేనిపాడు తదితర గామాల్లోని శ్రీ నాగేంద్రస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బలివే శ్రీ రామలింగేశ్వరుడికి ఆలయ అర్చకులు విశేష అభిషేకాలు, పూజలు చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, ఆలయ ప్రాంగణంలోని నాగేంద్రస్వామి పుట్టలో ఆవు పాలు పోసి, మొక్కులు తీర్చుకున్నారు.

నూజివీడు టౌన్: నాగుల చవితిని పురస్కరిం చుకుని నూజివీడు, మండల ప్రాంతాల్లో భక్తులు పుట్టల్లో పాలు పోసి మొక్కు లు తీర్చుకు న్నారు. అన్నవరం లోని సుబ్రహ్మణ్యే శ్వర స్వామి ఆల యంలో సర్వసూక్త సహిత అభిషేకాలు, శివ సహస్ర నామా ర్చన సుబ్రహ్మణ్యే శ్వర సహస్ర నామార్చ నలను ఆలయ అర్చకులు బావరాజు పుల్లారావు ఆధ్వర్యం లో నిర్వహించారు.